ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 16, సెప్టెంబరు 2025

అద్వితీయం

- తొలి త్రైమాసికంలో మెరుగుపడ్డ స్థానం
- జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్యంలో 23.54శాతం సాధన
- రాష్ట్ర సగటు కన్నా 5.36శాతం అధికం
- కలెక్టర్ల సదస్సులో ప్రకటించిన ప్రభుత్వం
- దొనకొండ ప్రాంతంలో ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాల తయారీ క్లస్టర్ ఏర్పాటు



అమరావతిలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత సంవత్సరం (2025-26)లో స్థూల ఉత్పత్తి లక్ష్య సాధనలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈఏడాది జిల్లాలో మొత్తం వ్యవసాయ, పరిశ్రమలు, సేవా రంగాల స్థూల ఉత్పత్తి రూ.65,543 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకోగా అందులో తొలి త్రైమాసికం (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) 23.54శాతంతో రూ.15,429 కోట్లు సాధన జరిగింది. ఆ మేరకు రెండు రోజులపాటు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం ప్రకటించింది. తొలిరోజైన సోమవారం స్థూల ఉత్పత్తి లక్ష్యాల సాధన, సంక్షేమం, లాజిస్టిక్స్-మౌలిక సదుపాయాలు, స్వచ్ఛభారత్ తదితర రంగాలపై సమీక్ష నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వ ప్రాధాన్యతలు, ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి ప్రణాళికలు, తొలి త్రైమాసికంలో లక్ష్య సాధనలను జిల్లాలు, ఆయా ప్రధాన రంగాల వారీగా వివరించారు.

లక్ష్యసాధనలో ముందున్నాం..

రాష్ట్రంలో ఈ ఏడాది గతం కన్నా 17.11శాతం వృద్ధి లక్ష్యంగా 18.65లక్షల కోట్ల స్థూల ఉత్పత్తి సాధనకు ప్రణాళికలు రూపొందించగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తొలి త్రైమాసికంలో 19.18శాతం లక్ష్యాలు

మిగతా 6వ పేజీలో

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల్లో స్త్రీశక్తి మాత్రం దూసుకెళుతోంది. గతంలో అంతంతమాత్రంగా ఉండే మహిళా ప్రయాణికుల సంఖ్య నేడు రెట్టింపు అయింది. ఈ ఏడాది ఆగస్టు 15న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించిన ఉచిత ప్రయాణ పథకానికి అనూహ్య ఆదరణ లభిస్తోంది. ప్రకాశం రీజియన్‌లో ఆర్టీసీకి ఆర్థిక పుష్టి లభిస్తున్నప్పటికీ మరోవైపు పెరుగుతున్న ప్రయాణికుల దృష్ట్యా బస్సుల సంఖ్య, సిబ్బంది కొరత వేధిస్తోంది. నిన్న మొన్నటివరకు పల్లె ముఖం ఎరుగని పల్లె వెలుగు బస్సులు ఇప్పుడు ఊరూరా తిరిగేస్తున్నాయి.



మహిళలతో రద్దీగా ఉన్న ఒంగోలు బస్టాండ్

రోజుకు లక్ష మంది





బస్సులన్నీ కిటకిట

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య ఇదీ..

- అనూహ్య ఆదరణతో దూసుకెళుతున్న 'స్త్రీ శక్తి'
- 35 శాతం నుంచి 65శాతంకు పెరిగిన మహిళా ప్రయాణికులు
- నెలరోజుల్లో సంస్థకు రూ.11.20 కోట్ల ఆదాయం
- ఉచిత ప్రయాణంలో సిబ్బందికీ అవమానాలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి స్త్రీశక్తి కలిసొచ్చింది. రీజియన్ పరిధిలో ఈనెల రోజుల్లో 25లక్షల 24వేల మంది మహిళలు ప్రయాణించినట్లు సంస్థ అధికారులు వెల్లడిస్తున్నారు. రోజుకు సుమారు లక్ష మంది ఊరూరా ప్రయాణిస్తున్నారని సమాచారం. రీజియన్ పరిధిలో రోజుకు 2.3లక్ష కిలోమీటర్లు అన్ని బస్సులు నడపగా, కేవలం స్త్రీ శక్తికి కేటాయించిన బస్సులే 1.30 లక్షల కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలుస్తోంది. దీంతో నెల రోజుల్లో ఆర్టీసీకి రూ.11.20 కోట్ల మేర ఆదాయం లభించింది. పథకం మరింత సమర్థవంతగా అమలుకు అదనపు బస్సులు, సిబ్బంది పెంపు అవసరంగా కనిపిస్తోంది.

పెరిగిన మహిళా ప్రయాణికులు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమై సరిగ్గా నెల అవుతోంది. నాడు పల్లె ముఖం ఎరుగని బస్సులు ఇప్పుడు స్త్రీశక్తి పుణ్యమా అని ఊరూరా తిరుగుతున్నాయి. జిల్లాలో మొత్తం 485 బస్సులు నడుపుతుండగా, అందులో 325 'స్త్రీ శక్తి'కి కేటాయించారు. దీంతో పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులకు మరింత డిమాండ్ ఏర్పడింది. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో గతంతో పోల్చుకుంటే ఈ నెల రోజుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయింది. గతంలో ఆర్టీసీ బస్సుల్లో 35శాతం మంది మహిళలు మాత్రమే ప్రయాణించారు. ఇప్పుడు వారి సంఖ్య రెట్టింపు అయింది. ఈనెల రోజుల గణాంకాలను పరిశీలిస్తే మహిళా ప్రయాణికులు 65శాతం పెరగ్గా, పురుషులు 35 శాతం మాత్రమే ప్రయాణించినట్లు అర్థమవుతుంది.

రూ.11.20 కోట్లు ఆదాయం


ప్రకాశం రీజియన్‌లో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలోని 866 గ్రామాలకు అనుసంధానంగా 20 బస్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. అలాగే 484 ఆర్టీసీ బస్సులు

మిగతా 6వ పేజీలో

డీఎస్సీ ఫలితాలు విడుదల

- ఎంపికైన అభ్యర్థుల అధికారిక ప్రకటన
- వెబ్‌సైట్‌లో తుది జాబితాలు
- డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్

మెగా డీఎస్సీ అభ్యర్థుల ఉత్కంఠకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను అధికారికంగా ప్రకటించింది. దాన్ని డీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచింది. జాబితాల్లో తమ పేర్లు చూసుకున్న అభ్యర్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి తల్లిదండ్రులు స్వీట్లు తినిపించి సంతోషాన్ని పంచుకున్నారు. కాగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన వారిలో కొందరి పేర్లు ఎంపిక జాబితాల్లో లేకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఒకరిద్దరు అభ్యర్థులు కంటతడిపెట్టుకున్నారు.



వెబ్‌సైట్‌లో జాబితాను పరిశీలిస్తున్న డీఈవో



జాబితాలో పేరు చూసుకుంటున్న అభ్యర్థి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సంబంధించి జిల్లాలో 672 పోస్టులు ప్రకటించగా 661 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. అర్హులు లేకపోవడంతో 11 మిగిలిపోయాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 599 పోస్టులు ప్రకటించగా 593 భర్తీ అయ్యాయి. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రకటించిన 30 పోస్టులకూ అభ్యర్థులను ఎంపిక చేశారు. గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాలలు, చెంచు పాఠశాలలకు ప్రకటించిన 43 పోస్టుల్లో ఐదు ఎస్సీ గ్రూపు-1కు కేటాయించడంతో అవి భర్తీ కాలేదు. వీటిని కూడా వచ్చే డీఎస్సీలో భర్తీ చేస్తారు.

అన్ని వివరాలతో ఎంపిక జాబితా

టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల అన్ని వివరాలను ఎంపిక జాబితాలో ప్రకటించారు. పాఠశాలల యాజమాన్యాలు, పోస్టు వారీ, అభ్యర్థి డీఎస్సీ ర్యాంకు వారీగా అన్ని వివరాలు ఆ జాబితాల్లో పేర్కొన్నారు. అభ్యర్థి ఎంపికైన పోస్టు బ్యాక్‌లాగ్ పోస్టా, ప్రస్తుత ఖాళీనా అన్న వివరాలు కూడా ఇచ్చారు. లోకల్/నాన్‌లోకల్ కోటా దేనిలో ఎంపికయ్యారో కూడా పేర్కొన్నారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో అభ్యర్థులను ఎంపిక

మిగతా 6వ పేజీలో

డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

డీఎస్సీ ఫలితాలపై సోమవారం స్థానిక డీఈవో కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. డీఎస్సీ ఎంపికలపై ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు ఈ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఎంపికైన వారికి ఏమైనా సందేహాలు ఉంటే ఈ డెస్క్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారు. ఈనెల 22 నుంచి 29 వరకు కొత్త టీచర్లకు రెసిడెన్షియల్ విధానాల్లో శిక్షణ ఇస్తారు. ఈ సమయంలోనే పాఠశాలలు కేటాయించి నియామకపు ఉత్తర్వులు ఇస్తారని లింగేశ్వరరెడ్డి తెలిపారు.



అధ్యాపకులను విచారిస్తున్న ఆర్జేడీ పద్మజ

అధ్యాపకుల మధ్య రగడపై ఆర్‌జేడీ సీరియస్

- కొమరోలు కళాశాలలో విచారణ
- ఐదుగురిపై తాత్కాలిక చర్యలు

కొమరోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల రగడపై గుంటూరు ఆర్‌జేడీ పద్మజ సీరియస్ అయ్యారు. 'అధ్యాపకుల పోరు.. విద్యార్థులు ఏమౌతారో' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించిన ఆమె సోమవారం ఆర్ఐవో రామాంజనేయులుతో కలిసి కళాశాలకు వచ్చి ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. రాతపూర్వకంగా వారి నుంచి సమాచారాన్ని సేకరించారు. ప్రాథమికంగా కొన్ని అంశాలపై ఒక నిర్ధారణకు వచ్చారు. అధ్యాపకులు ఒకరిపై మరొకరు లేఖల ద్వారా కళాశాలను భ్రష్టుపట్టించారని ఆమె వ్యాఖ్యానించినట్లు తెలిసింది. విచారణ అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కళాశాలలో గొడవకు బాధ్యులైన ఐదుగురిపై ప్రాథమికంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. యూడీసీగా పనిచేస్తున్న కిషోర్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై ఉలవపాడుకు మార్చినట్లు తెలిపారు. బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్ అధ్యాపకులు లోకేష్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్, హర్షవర్ధన్‌రెడ్డిని తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు చెప్పారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు.

అర్ధరాత్రి అలజడి

- శివారు ప్రాంతాల్లో దోపిడీకి యత్నం
- రెండు వేర్వేరు ఘటనలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజులుగా ప్రశాంతంగా ఉన్న ఒంగోలు నగరంలో మళ్లీ అలజడి ప్రారంభమైంది. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కొత్తపట్నానికి చెందిన కోడూరు శివశంకర్ రెడ్డి, ఆయన బావ దశరాజుపల్లికి చెందిన వాకా అనిల్‌కుమార్ రెడ్డి దశరాజుపల్లి ఫ్లైఓవర్ సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అదే ప్రాంతంలో మద్యం సేవిస్తూ ఉన్న పది మంది వారిరువురిపై దాడి చేశారు. శివశంకర రెడ్డి వద్ద నగదును కూడా లాక్కున్నారు. ఈమేరకు రిమ్స్ ఔట్‌పోస్టులో బాధితుడు ఫిర్యాదు చేశాడు. అనంతరం 12 గంటల తరువాత కొత్తపట్నం రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జిపై జయప్రకాష్ కాలనీకి చెందిన యస్‌కే.సుబానీ ఇందిరమ్మ కాలనీవైపు వెళుతుండగా కొంతమంది స్కూటీలు అడ్డుగా పెట్టి అతనిపై దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కొని కొద్దిసేపు హడావుడి చేశారు. అనంతరం సెల్‌ఫోన్ తిరిగి ఇచ్చారు. ఇలా వరుసగా రెండు ప్రాంతాల్లో దాడులకు పాల్పడింది ఎవరు అనేది అంతు చిక్కలేదు. ఈ మేరకు పోలీసులు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దశరాజుపల్లి ఫ్లైఓవర్ వద్ద జరిగిన దాడిలో ఎలాంటి నగదూ పోలేదని తాలుకా సీఐ విజయకృష్ణ తెలిపారు.



బీట్‌గార్డ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బీట్‌గార్డ్‌పై ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆగ్రహం

- టోపీని నిర్లక్ష్యంగా విసిరేసిన అధికారి
- అడవికి వెళ్లిన మహిళలపై అసభ్య దూషణ
- క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం

7

సామాజిక తనిఖీలపై నీలినీడలు

- పేరుకు మాత్రమే ప్రజావేదిక
- భారీగా వెలుగుచూస్తున్న అక్రమాలు

7

రాక్సీ పట్టేసింది!

గంజాయి గుట్టురట్టు చేసిన పోలీసు జాగిలం

- పూరీ ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తుండగా గుర్తింపు
- 15 కిలోల గంజాయి, రూ.75వేలు స్వాధీనం
- ఇద్దరు అరెస్టు?.. అదుపులోకి మరో ఏడుగురు

ప్రాంతం : ఒంగోలు రైల్వే స్టేషన్

సమయం : సోమవారం సాయంత్రం 5.30 గంటలు

ఏం జరిగిందంటే : పూరీ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. దాన్ని క్రాసింగ్‌లో ఉంచారు. అప్పటికే రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఈగల్ టీం పూరీ ఎక్స్‌ప్రెస్‌లో సోదాలు చేపట్టింది. కొత్తగా వచ్చిన రాక్సీ జాగిలాన్ని కూడా రంగంలోకి దించింది. పోలీసులు ఒకవైపు తనిఖీలు చేస్తుండగా గంజాయి వాసన గుర్తించిన జాగిలం 15 కిలోలు ఉన్న బ్యాగ్‌లను పట్టుకుంది. వెంటనే అప్రమత్తమైన ఈగల్ టీం అక్కడే ఉన్న కేరళ జిల్లా కానూరుకు చెందిన ముజీబ్ రెహమాన్, ఒడిశాలోని బరంపూర్ జిల్లా కలపడ గట్టుకు చెందిన రేణులను అదుపులోకి తీసుకుంది. విచారించగా గంజాయిని ఒడిశా నుంచి కేరళకు తరలిస్తున్నట్లు తేలింది. మరో ఏడుగురు అనుమానితులను కూడా అదుపులోకి తీసుకొంది. వారి వద్ద రూ.75వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



ఈగల్ టీం స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

మత్తుపదార్థాల గుర్తింపుపై ప్రత్యేక శిక్షణ పొందిన రాక్సీ

మత్తు పదార్థాల గుర్తింపు, నేరస్థులను పట్టుకోవడంపై మంగళగిరిలో రాక్సీ జాగిలం 10 నెలలపాటు ప్రత్యేకంగా శిక్షణ పొందింది. మన జిల్లాకు కేటాయించిన ఈ జాగిలాన్ని ఈనెల 5న ఇక్కడికి తీసుకువచ్చారు. బెల్జియం మాలినోయిస్ జాతికి చెందిన రాక్సీని తొలిసారి సోమవారం రంగంలోకి దించారు. మొదటి రోజే అది రైలులోని గంజాయిని పట్టించి పోలీసు అధికారులతో శభాష్ అనిపించుకొంది. ఈ తనిఖీలలో ఈగల్ టీం సీఐ సుధాకర్, ఎస్ఐలు శ్రీకాంత్, చెంచయ్య, అంజనేయులు, శివరామయ్య, రైల్వే ఎస్సై మధుసూదనరావు సిబ్బంది పాల్గొన్నారు.



రైలులో బ్యాగ్‌లను వాసన చూస్తున్న రాక్సీ

\- ఆంధ్రజ్యోతి, ఒంగోలు క్రైం

22 నుంచి త్రిపురాంతకంలో శరన్నవరాత్రి ఉత్సవాలు.. పోస్టర్ ఆవిష్కరణ : 7లో

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు లక్ష్యమని ఏపీజీబీ డీజీఎం ఎం.అరుణ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చినగంజాం శాఖ నూతన కార్యాలయాన్ని నూతన భవనంలోనికి మార్చిన సందర్భంగా సోమవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖాతాదారుల సహకారంతోనే బ్యాంకు అభివృద్ధి చెందుతుందన్నారు. ఖాతాదారులకు ఆర్థికంగా చేయూతనివ్వడమే బ్యాంకు లక్ష్యమని అరుణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ సయ్యద్ యూసఫ్‌అలీ, బ్రాంచ్ మేనేజర్ కె.మధుసూధనరావు, మేనేజర్ డి.పోతురాజు, సిబ్బంది ఎస్.శిరీష టి.నాగఫణీంద్ర, షేక్.జానిబేగం, మురళిసింగ్, అనిల్‌కుమార్, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థికాభివృద్ధి చెందాలి

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు అన్నారు. స్థానిక సోపిరాల రైల్వేగేటు కూడలిలో వెలుగు డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్ కార్ట్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం గడ్డె పెదసుబ్బారావు మాట్లాడుతూ గ్రామంలోని శ్రీరామ గ్రూపులోని గుండూరి సృజన అనే డ్వాక్రా మహిళకు షాపు పెట్టుకొనేందుకు ఉచితంగా రూ.50 వేలను అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్యూర్ అనే లక్ష్యం కింద దీనిని ఇచ్చినట్లు తెలిపారు. ఒకే కుటుంబంలోని ఇద్దరు పని చేసుకుంటూ దీని మీద బతకవచ్చన్నారు. నెలకు సుమారుగా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు సందు శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారిధి, నరహరి శ్రీనివాసరావు, గుండ్రెడ్డి నరసింహారావు, పల్లపోలు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువకుడి ఆత్మహత్య

బల్లికురవ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రేమవివాహం వాయిదాపడడంతో జీవితంపై విరక్తి చెందిన కొమ్మినేనివారిపాలేనికి చెందిన బొజ్జా ఎబేపరరావు(20) ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు కొమ్మినేనివారిపాలెం ఎస్టీ కాలనీకి చెందిన ఎబేపరరావు ఒక యువతిని ప్రేమించి అమెతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. వివాహం రోజురోజుకు వాయిదా పడుతుండడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 9న ఎలుకల మందు తిని అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఒంగోలు వైద్యశాలకు తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



హిమబిందుతో ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన పి.హిమబిందు ఎంపికైంది. జిల్లా జూనియర్ పోటీలు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరగ్గా, అక్కడ హిమబిందు ఉత్తమంగా రాణించింది. దీంతో ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, సోమశేఖర్, దేవభిక్షం, శ్రావణి ప్రత్యేకంగా అభినందించారు.

'సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేదలకు అండ'

మద్దిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే విజయకుమార్ చెప్పారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 21 గ్రామాలలో 85 మందికి ఆ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పగుండూరి నాగేశ్వరావు, మండవ జయంత్‌బాబు, అడక స్వాములు, మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, మండవ వెంకటస్వామి, మన్నం రాజా, మన్నం కృష్ణ, దాసరి శిల్పా సౌందర్య, దాసరి రమేష్ బాబు, మార్నేని సుబ్బారావు, మార్నేని కృష్ణారావు, మార్నేని రాఘవరావు, దుగ్గినేని నరసింహారావు, మోనపాటి రామకృష్ణ, గడ్డం రవి, మండవ గోపినాథ్ పాల్గొన్నారు.

మహిళా దొంగల ముఠా అరెస్టు

● రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం



పట్టుబడిన కారు, నగదుతో డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్, సిబ్బంది

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంకుల వద్ద రెక్కీ నిర్వహించడం, పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి ఆ సొమ్ము కాజేయడం మొదలెట్టారు. అలా.. 14 రోజుల వ్యవధిలో వేర్వేరు రాష్ట్రాల్లో ఏకంగా 10 చోరీలు చేశారు. అందుకోసం రెండు కార్లను తీసుకుని, ఇద్దరు డ్రైవర్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఆఖరుకు ఆ మహిళా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా ఆట కట్టించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గర్ జిల్లా కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన దీప్ మాలా బాయి, పరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, కారు డ్రైవర్ ప్రదీప్ సిసోడియా పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప.. దొంగల ముఠా అరెస్టు వివరాలను సోమవారం వెల్లడించారు. కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రెండు కార్లను తీసుకుని, చోరీలు మొదలెట్టారు. ఈనెల 3న గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్టేట్ బ్యాంకు(గోరంట్ల శాఖ)లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు. మధ్యలో ఓ దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆయనను బ్యాంకు వద్ద నుంచే రెండు కార్లలో మహిళా ముఠా వెంబడించింది. దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ద్విచక్రవాహనంలోని రూ.3.80 లక్షల నగదును చోరీ చేశాయి. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్, ఎస్‌ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. దీప్ మాలాబాయి, పరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, మరో ఇద్దరు మహిళలు, ప్రదీప్, మరో కారు డ్రైవర్ ముఠా చోరీ చేసినట్లు గుర్తించారు. గోరంట్ల మండలంలో జాతీయర రహదారి పక్కనే కె హోటల్ వద్ద ఆదివారం ఐదుగురు మహిళలు, కారు డ్రైవర్ ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వరుస చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈనెల 3వ తేదీ మధ్య ఏకంగా పది చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. కడప జిల్లా పులివెందుల, జమ్మలమడుగులో మూడు, తెలంగాణలో మూడు, నంద్యాల జిల్లా, కర్ణాటక, ఒడిశాలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున మొత్తం పది చోరీలు చేసి, రూ.12.59 లక్షలు అపహరించారు. వారి నుంచి మొత్తం 7.50 లక్షలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు.. కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన సీఐ శేఖర్, ఎస్‌ఐ రామచంద్రయ్య పేర్లను రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో చొరవ చూపిన కానిస్టేబుళ్లు వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, హోంగార్డు ప్రియాంకకు నగదు బహుమతులను డీఎస్పీ అందజేశారు. ముఠాలో మరో ఇద్దరు మహిళలు, డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

అనధికార నిర్మాణాల అనుమతులపై చర్యలు

● పూర్వ కమిషనర్, ఏసీపీలపై చర్యలకు ఆదేశం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం హయంలో ఒంగోలు కార్పొరేషన్, టౌన్‌ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకున్న అవకతవకలు, అవినీతిపై పురపాలక శాఖ సీరియస్ అయినట్లు సమాచారం. అప్పటి నగర కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (రిటైర్డ్) కే.వెంకటేశ్వర్లుపై చర్యలకు ఆదేశించింది. నగరంలోని పలు భవన నిర్మాణాల్లో నిబంధనలు అతిక్రమించి నిర్మించుకునేందుకు వీరు పరోక్షంగా ప్రోత్సహించారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో జరిగిన అవినీతిపై హైకోర్టు న్యాయవాది డి.ఎస్.సుబ్బారావు విజిలెన్స్, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలు కార్పొరేషన్‌కు సంబంధించి ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) కట్టకుండానే బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. అందులో ప్రధానంగా బండ్లమిట్ట టీబీ రోడ్ కూడా ఉండగా, నగరంలోని ఊరచెరువు, అద్దంకి బస్టాండ్‌లో నిర్మించిన షాపింగ్ మాల్స్ పలు ప్రాంతాల్లోనూ అనుమతులు లేకుండా జీ+2 పర్మిషన్ తీసుకుని అదనపు అంతస్తులు నిర్మించడంపైనా ఫిర్యాదులు ఉన్నాయి. వ్యాపార సంస్థల నిర్మాణాలకు భవన నిర్మాణం ఖర్చులో 10 శాతం కార్మిక శాఖకు లేబర్ సెస్ రూ.కోట్లలో చెల్లించాల్సి ఉండగా, మొక్కుబడిగా సెస్ విధించి రూ.కోట్లు దిగమింగేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో కార్పొరేషన్‌కు, కార్మిక శాఖకు భారీ నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేయడంతో అవినీతి బయటపడింది. దీంతో పూర్వ కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, ఏసీపీ కేవీలపై చర్యలకు ఆదేశిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఎంపిక జాబితాలను కలెక్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డు, డీఈవో కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

ఎంపిక కాని అభ్యర్థుల్లో నిరాశ

మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధిస్తామన్న ధీమాతో ఉన్న అభ్యర్థుల పేర్లు ఎంపిక జాబితాలో లేకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. స్కూలు అసిస్టెంట్, బయోలాజికల్ సైన్స్ పోస్టుకు దరఖాస్తు చేసిన ఒక అభ్యర్థికి ఎస్సీ గ్రూపు-3, అంగవైకల్యం రిజర్వేషన్లు ఉన్నాయి. దివ్యాంగుల్లో ఓహెచ్ కేటగిరీలో జిల్లా ఫస్ట్ అతనే. అయితే మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుపు రాకపోవడంతో విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. డీఎస్సీలో 76వ ర్యాంకు సాధించారు. మొత్తం 72 పోస్టులు ప్రకటించగా ఆయనకు 76వ ర్యాంకు రావడంతో ఉద్యోగం వస్తుందని ధీమా వచ్చింది. తీరా తుది జాబితాలో పేరు లేదు. దీంతో ఆ అభ్యర్థి ఒంగోలు వచ్చి డీఈవోను, హెల్ప్ డెస్క్‌లో కలిశారు. గత డీఎస్సీలో కేవలం అర మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాడు. డీఎస్సీకి హాజరుకావడానికి తనకు ఇదే చివరి అవకాశం అంటూ ఆ అభ్యర్థి కన్నీరుపెట్టుకున్నాడు. ఎంపికలో తనకు అన్యాయం జరిగిందంటూ డీఈవోకు, గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చారు. పాఠశాల విద్య డైరెక్టర్‌ను కలిసి తన గోడును చెప్పుకునేందుకు అమరావతి వెళ్లారు. అలాగే సోషల్ స్టడీస్ అభ్యర్థి ఒకరు, మరికొందరు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన ఎంపిక కాని వారు హెల్ప్‌డెస్క్‌కు ఫోన్లు చేస్తున్నారు.

రోజుకు లక్ష మంది

(5వ పేజీ తరువాయి)

ఉండగా వాటిలో 95 అద్దె ప్రాతిపదికన (హయ్యర్) నడుస్తున్నాయి. ఈ బస్సులన్నీ సుమారు రోజుకు 2లక్షల కిలోమీటర్లు ప్రయాణికుల కోసం రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిలో 1.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇంతకముందు ప్రకాశం రీజియన్‌కు రోజుకు రూ.77.51 లక్షల ఆదాయం వస్తుండగా, నెలకు రూ.23.25 కోట్లు అన్నివర్గాల ప్రజల నుంచి లభించేది. అందులో అత్యధిక శాతం మంది పురుషులే ఉండేవారు. ఉచిత ప్రయాణం పథకంతో అందులో సగం మందికిపైగా మహిళలు కావడంతో వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించడంతో 325 స్త్రీశక్తి బస్సుల ద్వారా రూ.11.20 కోట్లు ఆదాయం లభించింది. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ వారికి జీరో టికెట్ కొడతారు. అందుకు సంబంధించిన నగదును ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుంది. తద్వారా సంస్థకు ఆదాయం లభిస్తుంది.

ఆర్టీసీ సిబ్బందికీ అవమానాలు..!

స్త్రీశక్తి పథకం ద్వారా కేటాయించిన బస్సుల్లో ఉచిత ప్రయాణంలో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా సిబ్బందికి అవమానాలు తప్పడం లేదు. సీట్ల కోసం కొట్లాటలు. మాటల యుద్ధాలే జరుగుతున్నాయి. దీంతో సర్దిచెప్పేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ఆ బస్సులో ప్రయాణించే పురుషులకు సీటు లేక నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. కొందరు మహిళలు ఆ బస్సు మాకే కేటాయించారు, మీరు దిగిపోండని అవగాహన లేకుండా మాట్లాడుతుతున్నారు. పథకం అమలు వివరించే క్రమంలో మహిళ ప్రయాణికులు ప్రవర్తిస్తున్న తీరు మరింత ఆవేదన కలిగిస్తున్నదని సిబ్బంది వాపోతున్నారు. అంతేకాకుండా నిర్ణయించిన స్టాప్‌లోనే బస్‌ను ఆపుతున్న క్రమంలో తాము చెప్పిన చోట ఆపాలని పట్టుబడుతున్నారు. అలా వీలుకాదని కండక్టర్ చెప్పే క్రమంలో కొందరు మహిళల ఇష్టారీతిన మాట్లాడటం మరింత బాధిస్తోందని, స్త్రీ శక్తి బస్సుల్లో డ్యూటీ చేయలేమని కొందరు సిబ్బంది తేల్చిచెబుతున్నారు.

సిబ్బందికి సహకరించండి

- సత్యనారాయణ, ఆర్టీసీ ఆర్‌ఎం

మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం విజయవంతం చేయడం కోసం ఆర్టీసీ తరఫున అన్ని విధాలా కృషిచేస్తున్నాం. జిల్లాలో 484 బస్సులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. అందులో 325 బస్సులు ఉచిత ప్రయాణానికి కేటాయించాం. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళ ప్రయాణికులు సంఖ్య పెరగడం ఆర్టీసీకీ కూడా సంతోషం కలిగిస్తోంది. ముఖ్యంగా మారుమూల గ్రామాలకు కూడా బస్సులు నడపడం ఆనందంగా ఉంది. దయచేసి మహిళా ప్రయాణికులు సిబ్బందికి సహకరించాలి.

అ'ద్వితీయం'

(5వ పేజీ తరువాయి)

సాధించినట్లు పీయూష్‌కుమార్ తెలిపారు. జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, తొలి త్రైమాసికంలో సాధించిన లక్ష్యాలను ఆ సందర్భంగా ఆయన వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా త్రైమాసికంలో 24.20శాతంతో లక్ష్యసాధనలో ప్రథమ స్థానంలో ఉంది. 23.54శాతంతో ప్రకాశం జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. 21.96శాతంతో విజయనగరం తృతీయ స్థానంలో ఉంది. ఆ ప్రకారం చూస్తే తొలి త్రైమాసికంలో రాష్ట్ర సగటు కన్నా జిల్లాలో 5.36శాతం అధికంగా లక్ష్యసాధన కనిపిస్తోంది. స్థూల ఉత్పత్తిని ప్రధానంగా మూడు రంగాలుగా విభజించి లెక్కిస్తున్నారు. అందులో వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాలు ఉన్నాయి.

కలెక్టర్‌దే ప్రధాన బాధ్యత

జిల్లాలో ఈ ఏడాది (2025026) వ్యవసాయం, పాడిపరిశ్రమ ఇతర అనుబంధ రంగాల విలువ రూ.24,544 కోట్లు అంచనా వేయగా తొలి త్రైమాసికంలో 15.8శాతంతో రూ.2,924 కోట్లు లక్ష్య సాధన జరిగినట్లు పీయూష్‌కుమార్ తెలిపారు. అందులో సుమారు రూ.9,989కోట్లు పాడిపరిశ్రమల అనుబంధంగా వచ్చినట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో ఈ ఏడాది అంచనా విలువ రూ.10,873 కోట్లు కాగా తొలి త్రైమాసికంలో సుమారు 50.66శాతంతో రూ.5,509 కోట్లు సాధించినట్లు తెలిపారు. మూడో కీలకమైన సేవారంగం విలువ ఈ ఏడాది జిల్లాలో రూ.24,755 కోట్లు అంచనా కాగా తొలి త్రైమాసికంలో 23.62 శాతంతో రూ.5,847 కోట్ల లక్ష్య సాధన జరిగినట్లు వెల్లడించారు. కాగా మిగిలిన లక్ష్యాలను రానున్న మూడు త్రైమాసిక కాలంలో సాధించేందుకు కలెక్టర్ ప్రధాన బాధ్యత తీసుకొని ఆయా శాఖల అధికారులను సమన్వయంతో నడిపించాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

4వేల ఎకరాల్లో డిఫెన్స్ క్లస్టర్

రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధి, పెట్టుబడులు సాధనలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఐదు డిఫెన్స్ క్లస్టర్లలో ఒక దానిని జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ ఎన్.యువరాజ్ చెప్పారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇప్పటివరకు రూ.10వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపిందన్నారు. మొత్తం పది పారిశ్రామిక క్లస్టర్లు ఉండగా మరో 20 ఏర్పాటు కాబోతున్నాయన్నారు. వాటికి లక్ష ఎకరాలకుపైగా ఖాళీ భూములు గుర్తించినట్లు వివరించారు. భూసేకరణపై దృష్టిసారించాలని కలెక్టర్లను కోరారు. కాగా రాష్ట్రంలో ఐదు చోట్ల డిఫెన్స్ క్లస్టర్ల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పిన యువరాజ్.. అందులో జిల్లాలోని దొనకొండ వద్ద నాలుగు వేల ఎకరాల్లో ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాల తయారీ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దానిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని సూచించారు. రెండవ రోజైన మంగళవారం మరికొన్ని విభాగాలపై సమీక్ష జరగనుంది. సాయంత్రం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సంయుక్తంగా శాంతిభద్రతలపై సమీక్ష చేయనున్నారు. కాగా తొలిరోజు సదస్సుకు జిల్లా మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ రాజాబాబు హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం సమీక్షకు ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు కూడా హాజరుకానున్నారు.

సొసైటీ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేస్తున్న కొండలరావు

పొన్నలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పీఏసీఎస్‌కు సొంత భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని చైర్మన్ ఉన్నం కొండలరావు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సొసైటీలో సుమారు 14 వేలకుపైగా రైతులు సేవలు పొందుతున్నారన్నారు. రూ.12 కోట్ల మేర రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సొసైటీకి సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనం నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కొండలరావు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి స్వామి.. సొసైటీకి అనువుగా ఉండేలా స్థలం కేటాయించాలని స్థానిక తహసీల్దార్ పుల్లారావును ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పల్లపోతు రమేష్‌బాబు, దాసరి కృష్ణారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

తైక్వాండోలో కారుమంచి యువకుల సత్తా

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కారుమంచి గ్రామానికి చెందిన మేడికొండ మణికంఠం, గాలి శివరామకృష్ణ అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటారు. ఈనెల 13,14 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో మేడికొండ మణికంఠ బంగారు, గాలి శివరామకృష్ణ రజత పతాకాన్ని సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డాన్ దగ్గుమాటి విజయ్ ఇరువురినీ ప్రశంసించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

పొన్నలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ జె.శివరామకృష్ణ సూచించారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను పరిష్కరించాలని టీచర్ల నిరసన



మండల కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ కొండపి జోన్ ఆధ్వర్యంలో టంగుటూరులోని మండల ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారథి, మండలాల శాఖల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పోలేరమ్మ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి పోలేరమ్మ ఆలయంలోని హుండీ కానుకలను బుధవారం లెక్కిస్తామని ఆలయ ఈవో బైరాగి చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ, బ్యాంకు అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు.

సీఎం కాన్ఫరెన్స్‌లో జేసీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో సోమవారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను ప్రత్యక్ష ప్రసారాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీక్షించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా వివిధ అంశాలపై కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేస్తున్నారు. అందుకు సంబంధించి ప్రత్యేక టైం టేబుల్‌ను కూడా రాష్ట్ర అధికారులు రూపొందించారు. ఆయా వివరాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాలని ఆదేశించారు.

రణభేరీ పోస్టర్ల ఆవిష్కరణ



రణభేరీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంకోరుతూ యూటీఎఫ్ నిర్వహించనున్న రణభేరి వాల్‌పోస్టర్లను సోమవారం టీచర్లు ఆవిష్కరించారు. మండలంలోని గమండ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు రవి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బైకు జాతర కార్యక్రమం నిర్వహించనన్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు కొండారెడ్డి, ప్రభాకరరెడ్డి, ఉమామహేశ్వరరావు, జయరామిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, మూర్తి పాల్గొన్నారు.

చీమకుర్తిలో మై టీడీపీ యాప్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు బహుళప్రయోజనం చేకూర్చే మై టీడీపీ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం చీమకుర్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పట్టణపార్టీ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, పూనాటి వెంకట్రావు, అవగనిగడ్డ శేషయ్య, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, పిచ్చయ్య, నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనంనేనివారిపాలెంలో కమ్యూనిటీహాలు ప్రాంగణం వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాయపూడి కోటయ్య, వేమా చిన్న కోటేశ్వరరావు, పొరాబత్తిన పేరయ్య, యలమందయ్య, బాలకోటేశ్వరరావు, ప్రభాకర్, కొండలరావు పాల్గొన్నారు.

రేపు పల్లామల్లి సొసైటీ మహాజన సభ

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లామల్లి సహకార సొసైటీ సంఘం మహాజన సభను 17వ తేదీన సొసైటీ ఆవరణలో నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పారా చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీలో సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పీఎం ఆవాస్ యోజన అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన-2(పీఎంఏయూ అర్బన్) పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో జేసీ ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హులైనవారు లబ్ధిపొందే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయడం, లబ్ధిదారుల కోసం ప్రత్యేకంగా రుణ మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పీఎం సూర్యఘర్, దాని ప్రయోజనాలు కూడా దక్కేలా చూడాలని, కొత్తగా నిర్మించిన ఇళ్లలోకి గృహప్రవేశాలు జరిగేలా పర్యవేక్షించడం కోసం ఈ పోస్టర్లను రూపొందించినట్లు జేసీ తెలిపారు. ఈకార్యక్రమంలో డిఆర్వో చిన ఒబులేషు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, టిట్కో డీఈఈ వీరబ్రహ్మాచారి, ఆనంద్, మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

● కరణం బలరాం నేతృత్వంలో జేసీని కలిసిన రైతులు



రైతులతో మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి కోరారు. నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామనికి చెందిన రైతులతో కలిసిసోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కలిసి సమస్యను వివరించారు. తిమ్మసముద్రం గ్రామంలోని నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు నల్లబర్లీ పొగాకును వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మీ కోసంలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేకదృష్టి సారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను జేసీకి విన్నవించారు. ఆయా సమస్యలపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆయాశాఖల శాఖల అధికారులు తమ వద్దకు వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టిపరిస్థితుల్లో అర్జీలు పెండింగ్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చి అర్జీలను చూడాలని, వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఒబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, జాన్సన్, శ్రీధర్‌రెడ్డి, మధూరి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రిలో భాగంగా ఈనెల 22 నుంచి జరిగే త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద జరిగే ఉత్సవాల ఏర్పాట్లను కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ ఎరిక్షన్‌బాబుకు వివరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన సూచనలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ప్రసాద్‌శర్మ, మండల పార్టీ అధ్యక్షుడు వలరాజుయాదవ్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ దేవినేని చలమయ్య ఉన్నారు.

ఇంటి పన్నులపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు ఇతర పనులన్నింటినీ వసూళ్లు చేయాలన్నారు. అందుకు సంబంధించి డివిజనల్ పంచాయతీ అధికారులు, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి పన్నులు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పన్నులు నూరుశాతం వసూళ్లు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 58 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన పోలీసు గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పోలీసు అధికారులు సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే చట్టపరిధిలో పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా భూవివాదాలు, చీటింగ్ కేసులు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన కేసులు గురించి ఫిర్యాదులు అందాయి.



పచ్చందనమే.. పచ్చదనమే!

త్రిపురాంతకం మండలంలో సాగర్ నీరు సమృద్ధిగా వస్తుండడంతో రైతులు వరి నాట్లు ముమ్మరం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 10వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారని అంచనా. ప్రస్తుతం దాదాపు 6వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేశారు. దీంతో ఇప్పటికే పంట పొలాల్లో పచ్చదనం పరుచుకుని కనిపిస్తోంది. పచ్చందం చూడముచ్చటగా ఉంది. జాతీయ రహదారికి ఇరువైపులా కనిపిస్తున్న పంట పొలాలు భూమికి పచ్చని రంగేసినట్టు అన్నట్టు కనిపిస్తోంది. మండల పరిధిలోని గొల్లపల్లి వద్ద కనిపించిన సుందర దృశ్యం ఇది.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి

బీట్‌గార్డ్‌పై ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆగ్రహం

● టోపీని నిర్లక్ష్యంగా విసిరేసిన అధికారి

● అడవికి వెళ్లిన మహిళలపై అసభ్య దూషణ

● క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం


కొమరోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అడవికి వెళ్లిన మహిళలపైనా, దేవాలయాలకు వెళ్లిన భక్తులపైనా అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని ప్రజలు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా అల్లినగరం బీట్ ఆధికారి లక్ష్మీనారాయణపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ కామూరి అమూల్య ఆధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని కొమరోలు, అల్లినగరం ఫారెస్ట్ బీట్‌లో పనిచేస్తున్న బీట్‌గార్డు లక్ష్మీనారాయణ అడవికిలో బిక్కికాయలు, సీతాఫలాలు కోసుకుని ఊరురా తిరిగి అమ్ముకునే మహిళలపైనా, మండలంలోని మందలపాయ దేవాలయం, మాధవ దేవాలయాలకు వెళ్లే భక్తులను అసభ్య పదాలతో వేధిస్తున్నారని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి చెప్పారు. సమావేశానికి వచ్చిన గార్డ్ లక్ష్మీనారాయణను ఎమ్మెల్యే ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఎర్రచందనం దొంగలను పట్టుకోకుండా పేదలపై ప్రతాపం ఏంటని అశోక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గార్డ్ టోపీని విసిరేసి కూర్చోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే మీకు క్రమశిక్షణ తెలియదా అంటూ మండిపడ్డారు. బీట్‌గార్డ్ తీరుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానం చేశారు. అతనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన చర్చలో కొమరోలు నుంచి రాజుపాలెం రోడ్డుకు రూ.4కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కొమరోలు ప్రభుత్వ వైద్యశాలను సీహెచ్‌సీగా మార్పు చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. మినీ స్టేడియం, బీసీ, కాపు భవనాలను త్వరలో పూర్తిచేస్తామన్నారు. కొమరోలు నుంచి హైదరాబాద్‌కు 8గంటలకు బయలుదేరేలా చూడాలని డిపో మేనేజర్‌కు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి, బిజ్జాం రవింద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు గోడి ఓబుల్‌రెడ్డి, బిజ్జాల తిరుమలరెడ్డి, టీడీపీ అధ్యక్షులు బోసేని వెంకటేశ్వర్లు, నాయకులు చలిచీమల శ్రీనివాసచౌదరి, పులకుర్తి వెంకటేశ్వర్లు, వీరంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీట్‌గార్డ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

సామాజిక తనిఖీలపై నీలినీడలు

● పేరుకు మాత్రమే ప్రజావేదిక ● భారీగా వెలుగుచూస్తున్న అక్రమాలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పెద్దారవీడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల అమలులో వాస్తవాలను వెలుగులోకి తెచ్చేందుకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో పెద్దారవీడు మండలంలో జరిగిన పనుల పరిశీలనకు సంబంధించిన సామాజిక తనిఖీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అప్పుడు పనిచేసిన సిబ్బంది పనుల విచారణకు వచ్చినవారితో తెరవెనుక ఒప్పందాల మేరకు విచారణ నామమాత్రంగా చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

పేరుకే సామాజిక తనిఖీలు

మండలంలో 2024-25కి సంబంధించిన సామాజిక తనిఖీలు పేరుకు మాత్రమే చేసి మమ అనిపించుకున్నారు. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో ఆ ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.20కోట్ల మేర చెల్లింపులు జరిగినట్లు రికార్డులు దాఖలయ్యాయి. వాస్తవానికి అంతమొత్తంలో ఎక్కడా పనులు జరిగినట్లు లేదు. వాటిని నిర్ధారించడానికి జరిగిన సామాజిక తనిఖీల్లో కొందరు ఉద్యోగులు నిబద్ధతతో పనిచేశారు. వారి తనిఖీలో కొన్నిచోట్ల పనులు చేయనట్లు, ఆయా పనులకు దొంగ మస్టర్లు తయారు చేసినట్లు వెల్లడైంది. కానీ ఎక్కువ చోట్ల తనిఖీలు చేయడానికి వచ్చిన సిబ్బంది, ఆ పనులు జరిగిన సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన సిబ్బందితో లాలూచీ పడి తప్పుడు నివేదికలను సమర్పించినట్లు సమాచారం. అసలు కొన్ని గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ చేస్తున్నట్లు లబ్ధిదారులకు కూడా తెలియకపోవడం సర్వే తీరుకు నిదర్శనం.

రూ.2 కోట్ల మేర అక్రమాల జరిగినట్లు నిర్ధారణ

మండలంలోని 19 పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల్లో సుమారు రూ.2 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో వెలుగుచూసినట్లు సిబ్బంది అంచనాకు వచ్చినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో విచారణ చేసిన అనంతరం అక్రమాలకు బాధ్యుల నుంచి నగదును రికవరీ చేయడంతోపాటు, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు ఎదురుచూస్తున్నట్లు సమాచారం.

యువకుడి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): లాడ్జిలో ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానిక పాతమార్కెట్ సమీపంలోని ధరణి ఇన్‌లాడ్జిలో సోమవారం జరిగింది. నాగులుప్పలపాడు మండలం చౌటపాలేనికి చెందిన కట్టా త్రినాథ్(32)కు రెండేళ్ల క్రితం ఒమ్మెవరానికి చెందిన యువతితో వివాహమైంది. ఆమెను ఉన్నత చదువుల కోసం 2024 ఆగస్టులో అమెరికాకు పంపించాడు. ఒంగోలులో రమ్య మెడికల్స్ నిర్వహిస్తున్న త్రినాథ్ భార్యను అమెరికాకు పంపిచేందుకు, వ్యాపార అవసరాలకు కొన్ని అప్పులు చేశాడు. భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలు కారణంగా 2025 ఫిబ్రవరి నుంచి త్రినాథ్ ఫోన్ నంబర్‌ను ఆయన భార్య బ్లాక్‌లిస్టులో పెట్టారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన త్రిపాథ్ ఒంగోలులోని ఓ లాడ్జిలో వారం రోజులుగా ఉంటున్నాడు. ఆదివారం నుంచి తన స్నేహితులకు బంధువులకు ఫోన్ చేసి అందరు జాగ్రత్తగా ఉండమని చెప్పాడు. సోమవారం ఉదయం అతని స్నేహితులు వచ్చిచూడగా లాడ్జి గదికి లోపలి గడియా వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు లాడ్జి సిబ్బంది ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయగా ఘటనా స్థలాన్ని పరిశీలించి త్రినాథ్ తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

వృద్ధురాలి మెడలో బంగారం దోపిడీ



బాధితురాలని, గ్రామస్థులను విచారిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడిచివెళ్తున్న వృద్ధురాలి మెడలోని 3 సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు లాక్కొని బైక్‌పై పరారయ్యారు. ఈ సంఘటన మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ కార్యాలయం రోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మూలగుంటపాడు గ్రామానికి చెందిన రాయి బ్రహ్మయ్య పంచాయతీ రోడ్డులో నూతన ఇంటిని నిర్మాణం చేస్తున్నారు. ఆ ఇంటి వద్దకు అతని తల్లి రాయి యానాదమ్మ సాయంత్రం సమయంలో వెళ్లి తిరిగివెళ్తున్నారు. ఈ తరుణంలో గుర్తుతెలియని ఇరువురు దుండగలు యూనికార్న్ బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలోని గొలుసును ఒక్కఉదుటన లాక్కొని వెళ్లారు. దీంతో ఆమె పెద్దగా కేకలు వేయగా దగ్గర్లో ఉన్నవారు దుండగులను వెంబడించగా దొరకకుండా అప్పటికే వేగంగా బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలని, గ్రామస్థులను విచారించారు. దగ్గరలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై మహేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. జనం సంచరించే సాయంత్రం సమయంలో వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును లాక్కొని వెళ్లడంతో స్థానికులు ఉలిక్కిపాటుకు గురయ్యారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ


● ప్రమాదంలో డ్రైవర్ మృతి ● నిద్రమత్తే కారణం



ప్రమాదానికి గురైన లారీ

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తు కారణంగా మూడు లారీలు ఒకదాని వెనుక మరోకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి దాటాక టంగుటూరు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు నుంచి ఒంగోలు వైపు ఖాళీ లారీ వెళుతోంది. నిద్ర మత్తులో వేగం తగ్గించి డ్రైవర్ వాహనాన్ని నడుపుతున్నాడు. వెనుక నుంచి వస్తున్న మరో ఖాళీ లారీ ముందు వాహనాన్ని ఢీకొట్టబోయి పక్కకు తిప్పడం వల్ల డివైడర్‌ను గుద్దుకుని కొద్దిదూరం వెళ్లి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. వాహనం సగ భాగం రోడ్డుపైనా మిగతా సగభాగం డివైడర్‌ను దాటి ఉంది. నెల్లూరు నుంచి ఒంగోలుకు సిమెంట్‌లోడుతో వెళుతున్న ఇంకో లారీ.. డివైడర్‌పైకి ఎక్కిన లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో చివరి లారీలోని డ్రైవర్ చింతల భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్‌ను ఒంగోలు రిమ్స్‌కు చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ భాస్కర్ మరణించాడు. మృతుడు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన వ్యక్తి. ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



గిరిబాబు(ఫైల్)

ముండ్లమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దిరిశాల గిరిబాబు (25) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన దిరిశాల సుబ్బయ్య, రమణల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కన్సల్టెన్సీ రంగంలో పని చేస్తుండగా, చిన్న కుమారుడు గిరిబాబు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గుండెపోటుకు గురై సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు హైదరాబాద్ వెళ్లి ఆస్పత్రిలో గిరిబాబు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఘనంగా మోక్షగుండం జయంతి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇంజనీర్లు

బేస్తవారపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోక్షగుండం గ్రామంలో సోమవారం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని పలువురు ఇంజనీర్లు మోక్షగుండం గ్రామంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ తమ్మినేని పెద్దిరెడ్డి నివాళులర్పించి విశ్వేశ్వరయ్య సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో గిద్దలూరు పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాస నాయక్, సుబ్బారావు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో క్యాషియర్ అరెస్టు

- రూ 5.42 లక్షలు గోల్‌మాల్

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న కొమట్ల విద్యానాథ్ రెడ్డిని సోమవారం అరెస్టు చేసినట్లు తాలుకా ఎస్సై ఫణిభూషణ్ చెప్పారు. విష్ణుప్రియ కల్యాణ మండపం పక్కన ఉన్న పెట్రోల్ బంకులో విద్యానాథ్ రెడ్డి పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రూ.5.42 లక్షలు నగదు గోల్‌మాల్ చేసినట్లు గుర్తించిన మేనేజర్ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

ఏకేయూ, స్కిల్ డిజైర్ మధ్య ఒప్పందం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ, హైదరాబాద్‌కు చెందిన స్కిల్ డిజైర్ టెక్నాలజీల మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. యూనివర్సిటీలో చదువుతున్న యూజీ, పీజీ విద్యార్థులకు అవసరమైన సాంకేతికతను స్కిల్ డిజైర్ సంస్థ అందిస్తుంది. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి, స్కిల్ డిజైర్ సంస్థ ప్రతినిధులు అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిన బదలాయించకుండా ప్రభుత్వమే నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిన ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే బాధ్యతలను ఖండించారు. 2021లో నేషన్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసి ఇంకా పూర్తి కాని 10 వైద్య కళాశాలలో మార్కాపురం ఒకటన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి బుధ, గురువారాల్లో నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. బుధవారం ఉదయం పది గంటలకు స్థానిక జీజీహెచ్ వైద్యశాలలో వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించే స్వస్థనారీ- సశక్త్ పరివార్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శ్రీ హర్షిణీ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ రవికుమార్ శ్రీ హనుమాన్ ఫిల్లింగ్ స్టేషన్ పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. గురువారం ఉదయం 8గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

525 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దులూరు, ఎండ్లూరు, మాచవరం గ్రామాల్లోని 525 పశువులకు గ్రామంలోని ఇంటింటా పర్యటించి గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి కే అనురాధ తెలిపారు. పశుపోషకులు గాలికుంటువ్యాధి టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు చిరంజీవి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రేపటి నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వైద్యశిబిరాలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మహిళల ఆరోగ్యంపై వైద్యశాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో బుధవారం నుంచి వచ్చే నెల 2వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా స్వస్థనారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబాన్ని బలపర్చే లక్ష్యంతో వైద్యశాఖ ప్రణాళికలు రూపొందించింది. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు సమయానుకూలంగా వైద్య సేవలు అందించనున్నారు. పోషకాహారాన్ని ప్రోత్సహించడంతో పాటు కుటుంబాలను స్వశక్తి చేయడం వంటివి చేపట్టనున్నారు. బుధవారం ఒంగోలులో కలెక్టర్ రాజాబాబు, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, శాసన సభ్యుడు దామచర్ల జనార్దన్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

28న కమ్మవారి సేవా సంఘం మహాజన సభ

ఒంగోలు (రూరల్),సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం మహాజన సభ ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మంగమూరు రోడ్డులోని రామచంద్రమిషన్ ఆవరణలోని అతిథి ఫంక్షన్ హాలులో జరుగుతుందని ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సంఘ విషయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశానికి సంఘ నాయకులు,సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.





ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరు..!

ఒంగోలు నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ఒకవైపు అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతుండగా, మరోవైపు పూర్వం ఎప్పుడో కట్టిన డివైడర్లు నేలకొరుగుతున్నాయి. స్థానిక కర్నూల్ రోడ్ బైపాస్ సెంటర్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద తెలుగుతల్లి, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద గ్రీనరీ అభివృద్ధి కోసం నిర్మించిన డివైడర్ పడిపోయి పదిరోజులు అయినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఆ డివైడర్ రాళ్లు రోడ్డుమీదకు రావడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. - ఒంగోలు కార్పొరేషన్

నగర అభివృద్ధిలో ఇంజనీర్లు భాగస్వాములు కావాలి

ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సభలో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధిలో ఇంజనీర్లు భాగస్వాములు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆర్కిటెక్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ దినోత్సవాన్ని ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎస్.రాజు, మధు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నగరంలో అధునాతన భవనాలు, మెగా షాపింగ్ మాల్స్, పలు నిర్మాణాలలో ఇంజనీర్లు భాగస్వాములు కావాలని కోరారు. విశ్వేశ్వరయ్య నిర్మాణ రంగంలో తనదైన శైలిలో చరిత్రలో నిలిచిపోయే నిర్మాణాలను నిర్మించారన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం అభినందనీయం అని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత మాట్లాడారు. అంతకుముందు కార్పొరేషన్ కార్యాలయంలో విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నగర కమిషనర్ కే. వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు.

ఆదర్శప్రాయుడు విశ్వేశ్వరయ్య

ఒంగోలు విద్య, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారతజాతిఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నవ ఇంజనీర్లందరికీ ఆదర్శప్రాయుడని క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీగాయత్రిలు చెప్పారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైకిన్ ఎయిర్ కండిషనర్ మాన్యుఫ్యాక్చరింగ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ జోషి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని లయన్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇంజనీర్లు శిఖాకొల్లి సురేష్, బద్వేల్ మహేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వలేటి రవీంద్ర, కార్యదర్శి అద్దంకి శ్రీనివాసరావు, కోశాధికారి ప్రసన్నకుమార్, పూర్వ అధ్యక్షులు ఆలపాటి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే నియమించాలి

నిరసన వారంలో భాగంగా కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆందోళన

ఒంగోలు విద్య, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో భాగంగా వెంటనే 12వ పీఆర్సీని నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు నిరసన వారంలో భాగంగా సోమవరం సాయంత్రం స్థానిక ప్రకాశం భవన్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జోన్ కన్వీనర్ బి. శేషారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడుతూ బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, మెమో నెంబరు 57ను వెంటనే అమలు చేయాలని, బోధనేతర పనులను రద్దు చేసి ఉపాధ్యాయులకు బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శేఖర్‌రెడ్డి, ఎస్కే బషీరున్నీషా, ఎం.అనిత, వీరరాఘవులు, సీహెచ్ మస్తాన్, డి.మధు, మౌలాలి, ఈశ్వరయ్య బి.రామారావు, సుబ్బయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఘనంగా 'జేసీఐ' ముగింపు వేడుకలు

అలరించిన చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డు

సూరే ఏడుకొండలుకు కమలపత్ర అవార్డు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వారోత్సవాల ముగింపు వేడుకలు సోమవారంరాత్రి ఘనంగా జరిగాయి. కాపు కల్యాణ మండపంలో జరిగిన వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లోని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఫ్యాన్సీ డ్రస్ పోటీలు ఆకట్టుకున్నాయి. ముగింపు సభలో జేసీఐ ఇంటర్నేషనల్ కమిషన్ చైర్మన్ ఎన్‌బీ హర్షవర్దన్ రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు జేసీఐకి ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని, సంస్థ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని ఎంతో విజయవంతంగా నిర్వహిస్తారని అన్నారు. ఈ వారోత్సవాలలో సుమారు 70 పాఠశాలలకు చెందిన 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జేసీఐ టఅధ్యక్షుడు మేడిశెట్టి వెంకట సుబ్బారావు చెప్పారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డు, సూరే ఏడుకొండలుకు కమలపత్ర అవార్డు, డాక్టర్ అంజనీ ప్రియదర్శినిని అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు, గంధవళ్ల రాధా రమణకు సూపర్‌కిడ్ అవార్డులతో సత్కరించారు. అదేవిధంగా పలువురిని ప్రొఫెషనల్ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో వారోత్సవాల చైర్మన్ శివకోటి రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి, మాంటిస్సోరి పి.ప్రకాష్ బాబు, జేసీ వీక్ కో చైర్మన్ గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్లు ఆత్మకూరు బ్రహ్మయ్య, బొమ్మల శ్రీనివాస రావు, డాక్టర్ జి.రవికుమార్, ఎస్.రామకృష్ణ, కే.వరుణ్ కుమార్, వి.వి.రమణ, మాజేటి గణేష్ పాల్గొన్నారు.



డాక్టర్ సీతారామయ్యతోపాటు పలువురిని సత్కరిస్తున్న జేసీఐ ప్రతినిధులు

'బౌద్ధంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానులే'

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమని, సర్వమానవ సమానత్వం, సర్వజీవ కారుణ్యం ప్రధానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బౌద్ధ ధర్మ ప్రచారకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో బౌద్ధ ధర్మ ప్రచార యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐసీడీఎస్ ఆర్‌జేడీ రాఘవరావు మాట్లాడుతూ 2600 ఏళ్ల క్రితమే స్త్రీ, పురుష సమానత్వాన్ని, సర్వమానవ సమానత్వాన్ని గౌతమ బుద్ధుడు తన భిక్షు సంఘంలో అమలు చేశారన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల హరిప్రసాదరావు, దాసరి సుందరం, బి.సుబ్బారావు, జార్జి, ప్రసాద్, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. అంతకు ముందు రాజపానగల్ రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభమై కొణిజేడు బస్టాండు, గద్దలగుంట మీదుగా మామిడిపాలెం అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు.



బౌద్ధ ధర్మంపై ప్రచారం చేస్తున్న సభ్యులు



నివాళులు అర్పిస్తున్న రవికుమార్, ఆంజనేయులు,హర్షిత్, సందీప్‌చక్రవర్తి

హర్షిణిలో ఘనంగా ఇంజనీర్స్ డే

ఒంగోలు విద్య, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సోమవారం శ్రీ హర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా విద్యార్థినులకు పోస్టల్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. సెమినార్లు, వివిధ సాంకేతిక పోటీల్లో విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డి.ఆంజనేయులు, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, వైస్ ప్రిన్సిపాల్ కే సందీప్ చక్రవర్తి, హెచ్‌వోడీ శ్రీదేవి పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.332

ఒంగోలు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పొగాకు వేలంకేంద్రం 2లో సోమవారం జరిగిన వేలంలో పొగాకు మేలు రకం కిలో రూ.332 పలికింది. వేలానికి మొత్తం 1055బేళ్లు రాగా 881 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర రూ.104 పలికింది.

అవీఇవీ

వర్మీ కంపోస్టు స్టాల్‌ను సందర్శించిన జేసీ



వర్మీ కంపోస్టు ప్యాకెట్‌ను అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద కేంద్రాలలో తయారైన వర్మీ కంపోస్టు స్టాల్‌ను జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ సందర్శించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక మీ కోసం కార్యక్రమం హాలు వద్ద ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ ఆ స్టాల్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల నుంచి సేకరించిన చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వర్మీ కంపోస్టును ప్రదర్శన చేయడంతో పాటు ప్రజలకు విక్రయించారు. వీటి విక్రయాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ తదితరులు ఉన్నారు.

18 నుంచి పాఠశాలల్లో మండల స్థాయి క్రీడాపోటీలు



మాట్లాడుతున్న ఎంఈవోలు రమణయ్య, రవి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న మండల స్థాయి పాఠశాలల క్రీడలను ఘనంగా నిర్వహించాలని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, రమణయ్యలు సూచించారు. మండల పరిధిలోని పాఠశాలల పీడీ, పీఈటీలతో పాఠశాల క్రీడల నిర్వహణపై స్థానిక మండల రిసోర్స్ భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించాల్సిన స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక ఉప్పుగుండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18వ తేదీన జరుగుతాయని తెలిపారు. మండల పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 14 నుంచి 17 ఏళ్ల లోపు విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల క్రీడల మండల కోఆర్డినేటర్ ఎస్ కృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జవహర్ నగర్‌లోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది అధిక మాసం కావడంతో నెల తర్వాత శ్రీకృష్ణ జయంతి వచ్చిందని, శ్రీవైష్ణవులు దీనిని జరుపుకుంటారని తెలిపారు. పూజలు అనంతరం వికాస తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో కోలాటాలు ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డా. కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడాకారుల ఎంపిక

గిద్దలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనున్న ఆటల పోటీలకు సంబంధించి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖాధికారులు అశ్వనీకుమార్, నాగభూషణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఈనెల 16వ తేదీ మంగళవారం స్థానిక టెన్నిస్ స్టేడియంలో సెలక్షన్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17, 18 తేదీల్లో జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు, ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారికి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభిరుచి ఉన్న విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో పోటీలు జరిగే రోజుల్లో ఉదయం 9గంటలకు చీఫ్ ఆర్గనైజర్ గుర్రం శోభన్‌బాబు, స్కూల్‌గేమ్స్ కోఆర్డినేటర్లు స్వర్ణ, శ్రీనివాసరెడ్డిను సంప్రదించాలని పేర్కొన్నారు.

రాచర్ల : జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 17, 18వ తేదీల్లో స్కూల్ గేమ్స్ మండల లెవెల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో వీ గిరిధరశర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో క్లస్టర్ హెచ్‌ఎం బీఎల్ రామానాయక్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఆసక్తిగల క్రీడాకారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు ధ్రువీకరించిన స్టడీ సర్టిఫికెట్, ఎంట్రీ ఫామ్స్‌తో 17వ తేదీ బుధవారం ఉదయం 9గంటలకు రాచర్ల జడ్పీ హైస్కూల్‌కు రావాలని ఎంఈవో సూచించారు. వివరాలకు ఆదర్శ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ రామును సంప్రదించాలని కోరారు. అనంతరం అక్కపల్లి ఎంపీపీ ఎస్ పాఠశాలను విజిట్ చేసి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు.

యోగా గురూజీకి సేవారత్న అవార్డ్



సేవారత్న అవార్డ్‌ను అందుకుంటున్న యోగా గురూజీ నారాయణ

గిద్దలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ బీఎస్ నారాయణరెడ్డికి సేవారత్న అవార్డు లభించింది. విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు ఆడిటోరియంలో మదర్ సర్వీస్ సొసైటీ 3వ వార్షికోత్సవం సందర్భంగా యోగా గురూజీ నారాయణరెడ్డికి సినిమా హీరోయిన్ రజిత, సంస్థ వ్యవస్థాపకులు ప్రసాద్ సేవారత్న అవార్డును ప్రదానం చేశారు. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, మిగులు భోజనాలను పేదలకు పంపిణీ చేయడం, మొక్కలు నాటే కార్యక్రమం, దాతల సహాయంతో విద్యా సామగ్రిని అందించడం, యోగా శిక్షణ తరగతులు ఇస్తున్న నారాయణరెడ్డిని ఈసందర్భంగా నిర్వాహకులు అభినందించారు.

జేవీవీ రాష్ట్ర కార్యదర్శిగా స్వరూపారెడ్డి



రాష్ట్ర కార్యవర్గంతో స్వరూపారెడ్డి

గిద్దలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శిగా గిద్దలూరుకు చెందిన వి.స్వరూపారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయనగరంలోని గురజాడ అప్పారావు ప్రాంగణంలో జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలు గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా గిద్దలూరుకు చెందిన స్వరూపారెడ్డిని రాష్ట్ర శాఖలో కార్యదర్శిగా ఎంపిక చేశారు.

19 వరకు సమస్యలపై బైక్ జాతా

రాచర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యల సాధనకు ఈనెల 15 నుంచి 19వరకు బైక్ జాతాను నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకుడు పాలుగుళ్ల రమణారెడ్డి అన్నారు. ఈ మేరకు జడ్పీహెచ్‌ఎస్‌లో యూటీఎఫ్ సభ్యులతో కలిసి సోమవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, చంద్రశేఖర్, అనురాధ, పార్వతమ్మ, రమణారెడ్డి, రఫి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేద్దాం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



కొమరోలులోని కళాశాల ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మీపై ఉన్న గౌరవాన్ని పాడుచేసుకోవద్దని అధ్యాపకులనుద్దేశించి అన్నారు. అధ్యాపకుల రాజకీయాలపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కళాశాలకు వచ్చిన ఆర్జేడీ పద్మజతో కళాశాలలో అధ్యాపకుల రచ్చపై అశోక్‌రెడ్డి మాట్లాడారు. వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సద్గుణరావు, గెస్టు అధ్యాపకులు నారాయణ, సొసైటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, శ్రీనివాస చౌదరి, కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డీలర్లకు ఈ-పోస్ మిషన్ల పంపిణీ



డీలర్లకు ఈపోస్ మిషన్‌లను పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నాలుగు మండలాల పరిధిలో ఉన్న చౌక దుకాణ డీలర్లకు సోమవారం ఈ-పోస్ మిషన్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైపాలెం, దోర్నాల, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల డీలర్లు, విజన్ టెక్ మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ భాషపై పట్టుకు 'మన తెలుగు పుస్తకం'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషపై పట్టు సాధించేందుకు మన తెలుగు పుస్తకం ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే గృహంలో సోమవారం తర్లుపాడు మండలం జగన్నాథపురం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొశ్నెట్టి జగన్ రచించిన మన తెలుగు పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియం చదువుల నేపథ్యంలో విద్యార్థులకు తెలుగు మాట్లాడడం, చదవడం సరిగా రావడంలేదన్నారు. ఉపాధ్యాయులు జగన్ రచించిన మన తెలుగు పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు జగన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, జనసేన పార్టీ తర్లుపాడు మండల అధ్యక్షుడు చేతుల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య, ఆలంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు అర్జీ ఇస్తున్న వెంకటేశ్వర్లు

పూర్వపు రస్తాను పునరుద్ధరించాలి

మార్కాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ భూమికి పూర్వం నుంచి ఉత్తరం వైపు ఉన్న రస్తాను అందరికీ ఉపయోగపడేలా పునరుద్ధరించాలని మండలంలోని బొడిచెర్ల గ్రామానికి చెందని పెడమాల వెంకటేశ్వర్లు సోమవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో మొత్తం 16 అర్జీలు దాఖలయ్యాయి. ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే కార్యక్రమంలో నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు కంభంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

కంభం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కందులాపురం సెంటర్లోని శ్రీ కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10.30గంటలకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఇబ్రహీం సోమవారం ప్రకటనలో తెలిపారు. నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో జరిగే ఈ కంటి పరీక్షలో శుక్లాలు ఉన్న వారిని గుర్తించి అదే రోజు వారి వాహనంలో శాంతిరాం వైద్యశాలకు తీసుకెళ్లి కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. అందరు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



జార్జి కాలేజీలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఘనంగా ఇంజనీర్స్ డే

మార్కాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో సోమవారం 58వ ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. జార్జి ఇంజనీరింగ్ కాలేజీలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జీవితం నేటి విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. పట్టణంలోని ఏ1 గ్లోబల్, ఇందిరా, కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఘనంగా ఇంజనీర్స్ డేను నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే)ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ నాయకులు మోక్షగుండం చిత్రపటానికి నివాళులర్పించారు. పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

18న జాబ్ మేళా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 18వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వాసుబాబు సోమవారం తెలిపారు. వివరాలకు 9553306631 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

జీతాల చెల్లింపునకు ఆర్‌ఎంవో హామీ



ధర్నా చేస్తున్న ఆసుపత్రి శానిటరీ వర్కర్స్

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏరియా వైద్యశాల శానిటరీ వర్కర్స్ సోమవారం ఏరియా వైద్యశాల ఎదుట ధర్నా చేశారు. వైద్యశాలలో 16 మంది శానిటరీ వర్కర్స్ పారిశుధ్య పనులు చేస్తుండగా, 7 నెలలుగా జీతాలు చెల్లించలేదు. ఎన్నిసార్లు విన్నవించినా వైద్యాధికారుల నుంచి స్పందన లేకపోవడంతో సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో ఆర్‌ఎంవో డాక్టర్ శివానంద్ వారివద్దకు వెళ్లి మాట్లాడారు. ఈనెల 19వ తేదీలోగా జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో శానిటరీ వర్కర్ యూనియన్ నాయకులు సీహెచ్ యోగమ్మ, కందుల కాశిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి షేక్ రఫీ, శానిటరీ వర్కర్స్ తెలిపారు.

పనిభారాన్ని తగ్గించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయం ఉద్యోగులు

తర్లుపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులకు పని భారం తగ్గించాలని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో బుర్రి చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే సర్వేలు, సంక్షేమ పథకాలు అందించే సేవలతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. వేతనం, ఇంక్రిమెంట్‌లు పెంచాలని, ప్రమోషన్ కల్పించాలని ఆ వినతిలో కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధవీడు ఎస్‌ఐగా శివ నాంచారయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ

కంభం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అర్ధవీడు మండలం నూతన ఎస్సైగా ఎం.శివనాంచారయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అర్ధవీడులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సుదర్శన యాదవ్‌ను ఒంగోలు వీఆర్‌కు పిలిపించారు. అర్ధవీడు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శివనాంచారయ్య మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



యూరియాను పంపిణీ చేస్తున్న ఏవో లక్ష్మీనారాయణ

అందుబాటులో సమృద్ధిగా యూరియా

పెద్దారవీడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులకు సంవృద్ధిగా యూరియా అందుబాటులో ఉందని ఏవో ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వ సబ్సిడీపై అందజేసే యూరియా పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాలు 35 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 13 టన్నుల మేర మొత్తం 48 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా కావాల్సిన వారు తప్పకుండా సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ నానో యూరియాను ఉపయోగించడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి లావణ్య, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పాటల పోటీల్లో రెండో బహుమతి



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో మల్లికార్జుననాయక్

త్రిపురాంతకం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మైనంపాడులో జరిగిన కళోత్సవం వేడుకల్లో వివిధ పోటీలకు మండలం నుంచి విద్యార్థినీవిద్యార్థులు హాజరయ్యారు. అందులో సోలో సింగింగ్ పోటీలో పాల్గొన్న త్రిపురాంతకం జడ్పీ ఉన్నతపాఠశాల 10వ తరగతి విద్యార్థిని బొందలపాటి శైలజ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని పొందింది. ఈ సందర్భంగా పాఠశాలలో శైలజను ఎంఈవో టి.మల్లికార్జున నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణకు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి శివారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మొగుళ్లపల్లి గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులలో ఈ వ్యాధి నివారణకు టీకాలు వేస్తే పాల ఉత్పత్తి తగ్గకుండా నివారించవచ్చునని అన్నారు. గ్రామంలో 540 జీవాలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు ఆరోగ్య సహాయకులు జిలాని, ఫజులుల్లా, మోనిక, ఆంజినాయక్, మంత్రునాయక్ పాల్గొన్నారు.

బాహ్య పరాన్న జీవులతో నిరోధక శక్తి తగ్గుతుంది

రాచర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాహ్య పరాన్న జీవుల వలన గొర్రెలు, మేకల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని రాచర్ల పశువైద్యాధికారి డీ హరిబాబు అన్నారు. అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజిమెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఒంగోలు వారి ఆధ్వర్యంలో సోమవారం జేపీచెరువు గ్రామంలో రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరాన్న జీవుల వలన జీవాల్లో అభివృద్ధి కుంటుపడి సరిగ్గా బరువు పెరగక వ్యాధి శక్తి తగ్గుతుందన్నారు. సీజనల్ వ్యాధులైన నీలినాలుక గాలికుంటు పారుడు, నులి పురుగుల వ్యాధులపై తీసుకోవాలసిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఆత్మ తరపున వాణి కెఎస్‌పల్లి పశు వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, సిబ్బంది రంగారావు, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి

బేస్తవారపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల అమలుపై ప్రధాని మోదీ హామీ నేటికీ నెరవేరలేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి అన్నారు. రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ సమావేశం అధ్యక్షుడు జె.అంకయ్య అధ్యక్షతన సోమవారం బేస్తవారపేటలో జరిగింది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని వీరారెడ్డి కోరారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి డాకాల పుల్లయ్య, సీపీఐ నియోజవర్గ సహాయక కార్యదర్శి జోసఫ్ పాల్గొన్నారు

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సోమయ్య డిమాండ్ చేశారు. ఇసుక సమస్యపై పాత బస్టాండ్‌లో భవన నిర్మాణ కార్మికులతో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. ఇసుక దందాను అరికట్టి, ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక దొరకక భవన నిర్మాణ కార్మికులకు పనులు లేవన్నారు. ఇసుక కొరతను తీర్చి అక్రమ దందాలను ఆపి ప్రజలకు ఉచిత ఇసుక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏనుగుల సురేశ్, డీకేఎం రఫి, బాలనాగయ్య, రూబెన్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

రాచర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భద్రత పర్యవేక్షణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఎస్‌ఐ పీ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పాలకవీడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నల్లబోతుల శ్రీనివాసులు సహకారంతో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సోమవారం ఆయన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపు, భద్రత పర్యవేక్షణ, దొంగతనాలు, అల్లర్లు వంటివి జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని చెప్పారు.

బోర్ దొంగతనంపై కేసు

మండలంలోని ఆకవీడు గ్రామంలో వల్లపురెడ్డి గురవయ్య అనే రైతు పొలంలో బోర్‌ను ఇప్పర్ల రవి అనే వ్యక్తి దొంగతనం చేసినట్లు ఫిర్యాదు చేయడంతో రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్ విద్యుదాఘానికి గురై వ్యక్తి మృతి చెందారు. గిద్దలూరు మండలం కంచిపల్లె గ్రామానికి చెందిన సగిలి రవి అనే వ్యక్తి కృష్ణాజిల్లా నూజివీడులో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందారు. మృతదేహాన్ని సోమవారం గ్రామానికి తీసుకురాగా టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ నాయకులు దప్పిలి శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ముండ్లపాడు ఉపసర్పంచ్ కడియం శేషగిరి పాల్గొన్నారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న కృష్ణకిశోర్‌రెడ్డి, నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో షేక్ కాలేషావలి అన్నారు. సోమవారం మండలంలోని జమ్మలమడక మెయిన్, ఏఏ, కొత్త మారెళ్ళ, మారెళ్ళ హెచ్ డబ్ల్యూ, మక్కెనవారిపాలెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలు, విద్యార్థులు నేర్చుకున్న అంశాలు, హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించాలన్నారు. తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆదాము, పున్నయ్య, ఆంజనేయ స్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


ఎమ్మార్పీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్, ఎంఈవోలు

పీసీపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రతిఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

తాళ్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతలేదని మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి అన్నారు. రైతులకు అవసరం మేరకు పంపిణీ చేసేందుకు అందుబాటులో ఉందని చెప్పారు. సోమవారం స్థానిక సొసైటీలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత ఉందంటూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండటంతో కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. వారి మాటలను రైతులు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: యూరియా కొరత ఉందని వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ అన్నారు. సోమవారం సీఎస్‌పురంలోని రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బండారు వెంకటరమణ, కె.వెంకట కొండయ్య, జి.కోటిరెడ్డి, బి.వెంకటరామయ్య, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

దొనకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికల నెట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను సోమవారం దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈపోటీల్లో జిల్లాస్థాయిలో వివిధ పాఠశాలలకు చెందినవారు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభచాటిన విద్యార్థులను జిల్లా జట్లకు ఎంపికచేశారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో జిల్లా తరుపున వారు పాల్గొంటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీ రామాంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ బి.మురళి, పలు పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత పనులు

తాళ్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో కొత్తపాలెం చెరువంక వద్దగల గల చప్టా పూర్తిగా పూడిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో తాళ్లూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపట్టారు. చప్టాపై ఉన్న గుంతలను కంకర దువ్వతో చదును చేశారు. ఈచప్టా వద్ద ప్రజలు పడుతున్న కష్టాలను గమనించిన ఎంపీడీవో ఎస్.సత్యం తగు చర్యలు తీసుకోవాలని గ్రామకార్యదర్శిని ఆదేశించారు. ఎంపీడీవో ఆదేశానుసారం పంచాయతీ నిధులతో సర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం ఆధ్వర్యంలో చప్టా వద్ద ఇరువైపులా నిండివున్న పూడికతీతను ఎక్స్‌కవేటర్‌తో తీయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా పూర్తిస్థాయిలో కాలువ తీయించారు. గ్రామ పంచాయతీ నిధులతో చప్టా వద్ద తాత్కాలిక మరమ్మతులు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు తీరాయి.

నిధులున్నా.. అభివృద్ధి పనులేవీ!

- మండల పరిషత్‌లో రెండేళ్లుగా పేరుకుపోయిన వైనం
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య కుదరని సఖ్యత
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు


దొనకొండ మండల పరిషత్ కార్యాలయం

దొనకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం మంజూరుచేసిన నిధులు దొనకొండ మండల పరిషత్ కార్యాలయంలో రెండేళ్లుగా పేరుకుపోయినట్లు సమాచారం. 2024-25, 2025-26 రెండు సంవత్సరాలకు చెందిన దాదాపు కోటి రూపాయల నిధులు రెండేళ్లుగా ఎటువంటి అభివృద్ధి పనులకు కేటాయించకపోవడంతో బ్యాంక్‌లో మూలుగుతున్నాయి. ఈనిధులను మండల పరిషత్ తీర్మానాలతో ఎంపీటీసీ సభ్యుల ద్వారా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీరు తదితర ప్రజల అవసరాలకు చెందిన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. సంబంధిత అధికారులు గ్రామాల్లో ప్రజలకు ప్రధాన అవసరమైన పనులు గుర్తించి నిధులు సద్వినియోగం జరిగేలా చర్యలు చేపట్టని వైఖరిని పలువురు ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. దీంతో మండలంలో 14 ఎంపీటీసీ స్థానాల్లోని గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో ఎటువంటి ముందడుగు పడకపోవటం ప్రజల్లో చర్చనీయాంశమైంది.

దొనకొండ మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు గాను అప్పటి వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఎన్నికల్లో ఒక్క ఆరవల్లిపాడు స్థానంలో మాత్రమే టీడీపీ గెలుపొందింది. మిగిలిన 13 ఎంపీటీసీ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. వెంకటాపురం ఎంపీటీసీగా గెలుపొందిన ఉషారాణి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన ఉషారాణి మండల పరిషత్‌కు మంజూరైన నిధులతో అప్పట్లో ఎంపీడీవో కార్యాలయం మరమ్మతులకు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. అనంతరం దర్శి నియోజకవర్గంలో వైసీపీలో జరిగిన రాజకీయ మార్పులు, తదనంతరం 2024 ఎన్నికల సమయంలో మండలంలో వైసీపీకి చెందిన నలుగురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారం చేపట్టింది. ఈక్రమంలో రెండేళ్లుగా మండల పరిషత్‌లో పేరుకుపోయిన నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించేందుకు వైసీపీకి చెందిన ఎంపీపీ, టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుల మధ్య ఒప్పందాలు కుదరలేదనేది విశ్వసనీయ సమాచారం. ఫలితంగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించేలా సంసిద్ధమవుతుంది. ఈనేపథ్యంలో ఎంపీటీసీల పదవీకాలం పూర్తయ్యేలోపు మండల పరిషత్‌లో పేరుకుపోయిన నిధులను వారి పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించి అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షాలకు ఛిద్రమైన రోడ్లు

దర్శి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దర్శి ప్రాంతంలో అనేక రోడ్లు ఛిద్రమయ్యాయి. గుంతలు పడి నీరు నిల్వ ఉండటంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పోతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డులో అనేకచోట్ల గుంతలు పడ్డాయి. కొన్నిచోట్ల తారులేచి కంకర బయటపడింది. దర్శి-సామంతపూడి రోడ్డులోనూ పలుచోట్ల గుంతలు పడ్డాయి. రోడ్డు మార్జిన్ కోసుకుపోయి ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తొలిగే వీలులేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, మరికొన్ని చోట్ల గ్రామీణ రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లపై పడిన గుంతలను 90శాతం పూడ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లన్నీ అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. అధికారులు దెబ్బతిన్న రోడ్లను గుర్తించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలుపడిన పాతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

విద్యుత్‌ను అక్రమంగా వాడితే కఠినచర్యలు

దర్శి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా విద్యుత్‌వాడిన వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఈ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. దర్శిలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన దాడుల వివరాలను వెల్లడించారు. మండలంలో 40 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేసి అక్రమ విద్యుత్ వాడకందారులపై కేసులు నమోదు చేశారు. రూ.2,75,500 అపరాద రుసుం విధించారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ పదిమంది అధికారులు, 80 మంది సిబ్బంది 40 బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు కె.వెంకటేశ్వర్లు, టి.హైమావతి, డీఈలు కె.రవికుమార్, పి.హరిబాబు, ఏఈలు కె.కోటయ్య, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పపంచ బ్యాంక్ ప్రతినిధులు డాక్టర్ ఎం.చరిత, డాక్టర్ ఏ.భార్గవి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శంకరాపురంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో పేద ప్రజలకు ఆరోగ్యపరంగా సేవలు ఎలా ఉన్నాయి? అని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఆయుష్మాన్ ఆరోగ్యం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. ఇక్కడ పేదలకు అందుతున్న వైద్య సేవల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మారెళ్ళ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి కేపీ రాజు, సూపర్‌వైజర్ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కనిగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనటంతో మృతిచెందిన ఘటన మండలంలోని చల్లగిరగల గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ శ్రీరాం తెలిపిన వివరాలమేరకు.. మిట్టా వెంకటేశ్వర్లు (42) అనే వ్యక్తి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో కనిగిరి నుంచి పొదిలి వైపు వెళుతున్న బైకు ఢీకొనడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. మోటర్‌బైక్ నడుపుతున్న వ్యక్తి పరారీ కాగా, వెనుక కూర్చున్న కోమటిగుంట్ల బాలచెన్నయ్య అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. బాలచెన్నయ్యను చికిత్స కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అలాగే, ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

తాళ్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పుగంగవరం వైద్యాధికారి మౌనిక పేర్కొన్నారు. సోమవారం మండలంలోని లక్కవరం, బొద్దికూరపాడు, తూర్పుగంగవరంలో పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాల నిర్ధారణకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఐవో చంద్రశేఖర్‌బాబు,హెచ్‌ఎస్ గోపీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కురిచేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా పరిశీలకులు, షైనంపాడు డైట్ కాలేజి ఉపాధ్యాయుడు ఆర్.జగన్నాధరావు సోమవారం తనిఖీ చేశారు. బోదనంపాడు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కురిచేడు జనరల్, అలవలపాడు ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో సుబ్బారావుతో కలసి పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్య పరిష్కారంలో ప్రభుత్వం అలక్ష్యం

దర్శి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం సాయంత్రం ఉపాధ్యాయులు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ దర్శి జోన్ కన్వీనర్ ఏఎల్ ప్రసాద్, మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నక్కా కోటేశ్వరరావు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనిగిరి: ఉపాధాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు తోట శ్రీనివాసులు, రామ్మోహన్, మేకల శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌బాబు, పి.మాలకొండయ్య, కేవీ సుబ్బయ్య, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలి

కనిగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, పి.మోహన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మరుతున్నా పేదలకు ఇళ్ళ స్థలాలు మాత్రం ఇవ్వటం లేదన్నారు. గత ప్రభుత్వం లక్షలాది మందికి ఇళ్ళ స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. దీంతో అర్హులైన పేదలు నష్టపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆమేరకు పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గులాం హుస్సేన్, బషీరా, హబీబా, పిచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలు మృతి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై మిద్దె ఎక్కుతూ ప్రమాదశాత్తు కాలు జారిపడి వృద్ధురాలు మృతిచెందారు. సీఎస్‌పురం మండలం విబైలు గ్రామానికి చెందిన బసివి లక్ష్మమ్మ (68) సోమవారం తమ ఇంటిపైన గింజలు ఆరబెట్టేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు మెట్లపై కాలు జారిపడ్డారు. ఈఘటనలో తలకు గాయాలుకావడంతో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. భర్త సుబ్బయ్య ఫిర్యాదుమేరకు హెడ్ కానిస్టేబుల్ అచ్చిరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

పామూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం నుంచి వచ్చేనెల 15 వరకు నెలరోజులపాటు గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు సీఎస్‌పురం పశువైద్యశాల ఏడీ డాక్టర్ ఆర్.రమేష్ తెలిపారు. ఇందుకుసంబంధించిన పోస్టర్‌ను పామూరులోని పశువైద్యశాలలో పామూరు, సీఎస్‌పురం పశువైద్యాధికారులు ఆర్.హనుమాన్, షేక్ మునీర్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీ రమేష్ మాట్లాడుతూ పామూరు, సీఎస్‌పురం మండలాలకు 40 వేల వ్యాక్సిన్‌లు మంజూరయినట్లు చెప్పారు. అనంతరం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో సచివాలయాల ఏహెచ్‌లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కనిగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విద్యుత్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జిల్లా విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సీహెచ్ హరికృష్ణ అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు సోమవారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఐ.రమేష్, ఎస్.సుభాష్, కృష్ణకుమార్, హుస్సేన్‌బాషా, అనంతయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కోసం వినతి

కురిచేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెద్దవరం గ్రామ పంచాయతీలో శ్మశానికి స్థలం కేటాయించాలని సోమవారం తహసీల్దార్ రజనీకుమారికి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు మాగులూరి రామయ్య మాదిగ మాట్లాడుతూ పెద్దరవం గ్రామంలో తమవర్గం వారు 40 కుటుంబాలు ఉన్నాయన్నారు. శ్మశానంలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినవారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు గూడూరి యోగేశ్వరరావు, జోసెఫ్, సాయన్న, రామయ్య తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

తాళ్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని టీడీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని విఠలాపురం గ్రామంలో చంద్రన్న-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలు పంపిణీచేశారు. కార్యక్రమంలో నవులూరి రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైతు సంఘం సీఎస్‌పురం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రత్నాకర్‌రెడ్డి, ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక నారాయణస్వామి కాంప్లెక్స్‌లో జరిగిన రైతు సంఘం మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా రత్నాకర్‌రెడ్డి, ఊసా వెంకటేశ్వర్లు, సభ్యులుగా నారా భాస్కరరెడ్డి, యారవ వెంకటసుబ్బయ్య, అంకేపల్లి వెంకటేశ్వర్లు, మోహన్‌ను ఎన్నుకున్నారు.

ముఖాముఖి

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

జె.వెంకటేశ్వరరెడ్డి, వైద్యాధికారి, ముండ్లమూరు



ప్రశ్న: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధులు ఉన్నాయా?

జవాబు: విష జ్వరాలు, దగ్గు, జలుబు లాంటి వ్యాధులు ఉన్నాయి. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ప్ర: విషజ్వరాలు సోకిన వారికి ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

జ: విష జ్వరాలు సోకిన వారిని వెంటనే గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

ప్ర: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఓపీల సంఖ్య ఎలా ఉన్నాయి?

జ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ముండ్లమూరు, సింగనపాలెం, పసుపుగల్లు, ఉల్లగల్లు, పులిపాడు, కెల్లంపల్లి, వేముల పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి ఇతర రోజుల్లో 50 నుంచి 70 ఓపీలు వస్తాయి. సీజనల్ వ్యాధులతో 150 నుంచి 200 వరకు ఓపీలు వస్తున్నాయి.

ప్ర: పారిశుధ్యం లోపం వల్లే విషజ్వరాలు ప్రబలుతున్నాయా?

జ: గ్రామాల్లో పారిశుధ్యం లోపించటం వల్లే విష జ్వరాలు వస్తున్నాయి. పంచాయతీ అధికారులతో మాట్లాడి గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్, ఎబేట్, ఆయిల్ బాల్స్ లాంటివి చల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పామూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్వీ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెల్‌ఫోన్, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.2,36,288 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.70,810, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ. 22,570, శాశ్వత అన్నదాన పథకానికి 51,876, మహాప్రాకార నిర్మాణానికి విరాళం రూ.85,516 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలని ఏపీఎం టి.హనుమంతరావు, వయోజన విద్య సూపర్‌వైజర్ వై.చౌడిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 4,075 మందిని అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

దొనకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దాయిపాలెం గ్రామానికి చెందిన రెవరండ్ ఫాదర్ చొప్పరపు రమేష్ కొన్ని సంవత్సరాలుగా సొంత నిధులతో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన వైద్యశిబిరానికి 200 మంది హాజరయ్యారు. నెల్లూరుకు చెందిన మోడరన్ ఐ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వారందరికి ఫాదర్ రమేష్ తన సొంత ఖర్చులతో కంటి ఆపరేషన్లు చేయించేందుకు ప్రత్యేక వాహనంలో నెల్లూరు తరలించారు.

నాణ్యమైన ఎరువులను అందజేయాలి

తాళ్లూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు అందజేయాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. తూర్పుగంగవరంలోని మన గ్రోమోర్, శ్రీవెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. యూరియా, డీఏపీ ఎరువుల శాంపిల్స్‌ను సేకరించి విశాఖపట్టణం రీజనల్ కోడింగ్ సెంటర్లకు పంపుతున్నట్లు తెలిపారు.

చిల్ల చెట్లు తొలగింపు

పామూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పు బైపాస్ జంక్షన్ రోడ్డు మలుపు వద్ద ఇరువైపులా మొలచి ఉన్న చిల్లచెట్లను సీఐ ఎం.భీమానాయక్ తన సిబ్బందితో సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి రోడ్డు మలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండటంతో తొలగించారు.




ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

- 2024-25 పనితీరులో ఏపీ ఎంపీల్లో లావుకు అగ్రస్థానం
- పార్లమెంట్ నివేదికలో వెల్లడి

ప్రశ్నించావు.. ప్రథమంగా నిల్చావు!

నరసరావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి నరసరావుపేట ఎంపీ నంబరు వన్ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. ఈ మేరకు పార్ల మెంట్ ప్రతినిధులు ఆదివారం నివేదికను విడుదల చేశారు. పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరుపై సదరు బృందం నివేదికను రూపొందించింది. పార్లమెంట్ సమావేశాలకు హాజరు, ప్రజా సమస్యలపై అడిగిన ప్రశ్నలు, వివిధ అంశాల్లో జరిగిన చర్చల్లో పాల్గొన్న లావు ఏపీకి చెందిన పార్లమెంట్ సభ్యుల్లో ప్రథమ స్థానం పొందారు. 2024-25లో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో శ్రీకృష్ణదేవరాయలు 67 పశ్నలు అడిగారు. లోక్‌సభలో వివిధ అంశాలపై 22 చర్చల్లో ఆ యన పాల్గొన్నారు. పార్లమెంట్‌కు ఆయన హాజరు 83.82 శాతంగా నమోదైంది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా లోక్‌సభలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

పల్నాడు అభివృద్ధికి నిరంతర కృషి

రాష్ట్రానికి రావాల్సిన వివిధ ప్రాజెక్టులపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నించడంతో పాటు వాటిపై కీలకంగా లావు చర్చించారు. అమరావతి రాజధానికి ప్రభుత్వం తరఫున నిధుల కోసం లావు కృషి చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సూచించిన విధంగా పార్లమెం ట్‌లో వాటి సాధనకు తన వంతు కృషి చేస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారుల నిధుల విడుదలకు కృషి చేశారు. వరికపూడిసెల ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు సాధించడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. పేరేచర్ల - కొండమోడు జాతీయ రహదారి విస్తరణకు నిధుల విడుదల, జిల్లాలో పలు చోట్ల రైల్వే ఆర్‌యూబీల మంజూరు, నాగార్జున సాగర్ పర్యాటక అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల మంజూరు చేయించడంలో లావు విజయ వంతమయ్యారు. జిల్లా ప్రగతి కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ఎ ప్పటికప్పుడు కేంద్ర మంత్రులతో చర్చల ద్వారా సా నుకూలత సాధిస్తున్నారు. జిల్లాకు కేంద్ర విద్యాల యాల మంజూరులో ఆయన పాత్ర ఉంది. పార్లమెం ట్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన లావు శ్రీ కృష్ణదేవరా యలను పలువురు పార్టీ నేతలు అభినందించారు.

15.50 శాతం వృద్ధి లక్ష్యం కావాలి

- విభాగాల వారీగా పనితీరు మెరుగుపడాలి
- ఫిషరీస్ విభాగం జీవీఏలో టాప్5లో బాపట్ల జిల్లా
- కలెక్టర్ల సదస్సులో సీఎం దిశానిర్దేశనం

నేడు ఎస్పీ హాజరు..

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో భాగంగా జిల్లా ఎస్పీ బీ ఉమామహేశ్వర్ మంగళవారం హాజరుకానున్నారు. గతేడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నేరగణాంకాలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై నివేదికలతో ఎస్పీ సదస్సుకు హాజరు కానున్నారు.


సదస్సులో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా అధికారులు పనిచే యడంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం జీఎస్‌డీపీలో వృద్ధిరేటు నమోదు కావాలని సచివాలయం వేదికగా సోమవారం జరి గిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు మార్గ నిర్దేశనం చేశారు. తాజా బదిలీల్లో భాగంగా జిల్లా కు నూతన కలెక్టర్, ఎస్పీ నియామకం అయిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వీ వినోద్‌కుమార్ శనివారం బాధ్యతలు తీసుకోగా, సచివాలయం వేదికగా సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సుకు జిల్లా సమాచారంతో ఆయన హాజరయ్యారు. ఇందులో భాగంగా సదస్సు ఎజెం డాలో పొందు పర చిన అంశాలతో పాటు, త్వరలో జరగబోయే బీచ్ ఫెస్టివల్, యూరియా అంశాలపై సమగ్ర సమాచారం వంటి అంశాలతో కలెక్టర్ సదస్సు బాట పట్టారు. ప్రభుత్వం వద్ద స్వర్ణాంధ్ర మొదలుకుని వ్యవసాయ సంబంధిత రంగాలలో జీవీఏ(స్థూల విలువ జోడింపు) పరంగా జిల్లా ఏస్థానంలో ఉందనే వాటిపై సవివర నివేదికలు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాకు సంబం ధించి జీఎస్‌డీపీ వృద్ధిరేటు 15.50 శాతం చేరేలా పనిచేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. కేపీఐ(కీ ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్)ర్యాంకులో భాగంగా స్వర్ణాంధ్రకు జిల్లా 61 పాయింట్లతో 19 వ స్థానంలో నిలిచినట్లు సదస్సులో నిలిచింది. అగ్రికల్చర్ విభాగంలో 32 పాయింట్లతో 5 వస్థానంలో నిలవడం గమనార్హం. వ్యవసాయ సంబంధిత రంగాల జీవీఏలో మాత్రం 13 శాతంతో 12 వస్థానంలో నిలిచినట్లు సదస్సులో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో పొందుపరిచారు. ఫిషరీస్ విభాగంలో జీవీఏలో జిల్లా 4 వస్థానంలో నిలికి టాప్ 5లో చోటు దక్కించుకుంది.

అత్యంత కీలక అంశాలపై...

బాధ్యతలు స్వీకరించిన ఒక్క రోజు వ్యవధిలోనే కలెక్టర్ వినోద్‌కుమార్ సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సదస్సుకు హాజరయ్యారు. జీఎస్‌డీపీ గణాంకాలతో పాటు ఆయా విభాగాలలో జిల్లాకు సంబంధించి జీవీఏ ర్యాంకులు ప్రభుత్వం వద్ద ఉండడంతో వాటి ఆధారంగా సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. వాటితో పాటు జిల్లాలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశాలపై సవివర నివేదికలతో కలెక్టర్ సదస్సుకు హాజరైనట్లు తెలుస్తోంది. వాటిలో ముఖ్యంగా ఈ నెల 26,27,28 తేదీలలో సూర్యలంక వేదికగా జరిగే బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లతో పాటు యూరియా ఇబ్బందులు అధికంగా ఎదుర్కొంటున్న మూడు జిల్లాల్లో బాపట్ల జిల్లా ఉండడంతో, ఇప్పటి వరకు జరిగిన పంపిణీ, ప్రస్తుతం ఉన్న నిల్వల వివరాలతో కలెక్టర్ సదస్సులో పాల్గొన్నారు. ఇవే కాకుండా మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన బర్లీ పొగాకు పరిమాణం ఎంత, అన్నదాతల ఖాతాల్లో జమ అయిన నిధుల వివరాల వంటి లెక్కలు కూడా సదస్సులో చర్చకు రావచ్చనే అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీ4 వంటి పథకంతో పాటు విభాగాల వారీగా ప్రస్తుత పనితీరు వంటివన్నీ కూడా సదస్సులో భాగం కానున్నాయి.

స్మార్ట్ న్యూ రైస్ కార్డులతోనే బియ్యం పంపిణీ : జేసీ

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ న్యూ రైస్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతుందని ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్ తెలిపారు. స్మార్ట్ న్యూ రైస్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ జిల్లాలో 1123 చౌకధరల దుకాణాలు నడుస్తున్నాయన్నారు. వాటి పరిధిలో 4,71,382 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. రైస్ కార్డులకు బదులుగా వాటి స్థానంలో స్మార్ట్ న్యూరైస్‌కార్డులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. 15వ తేదీ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించిన మేరకు పంపిణీ ప్రారంభించామన్నారు.

విద్యుత్ బకాయిలు.. రూ. 203 కోట్లు

- ప్రభుత్వానివి రూ. 51 కోట్లు, ప్రైవేటువి రూ. 152 కోట్లు
- వసూళ్ళపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి


అద్దంకిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం

అద్దంకి,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు బకాయిలు గుదిబండ లా మారాయి. బాపట్ల జిల్లాలో మొత్తం 203 కోట్ల రూపాయల వరకు బకాయిలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ బకాయిలు 51 కోట్ల రూపాయలు కాగా, ప్రభుత్వేతర బకాయిలు 152 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. ఆగస్టు నెల చివర వరకు బకాయిలు డివిజన్‌ల వారీగా పరిశీలిస్తే అద్దంకి డివిజన్‌లో ఎల్టీ కేట గిరిలో మొత్తం బకాయి 32.89 కోట్ల రూపాయలు కాగా, అందులో ప్రభుత్వ బకాయిలు 5.48 కోట్లరూపాయలు, ప్రభుత్వేతర బకాయిలు 27.41 కోట్ల రూపాయలు గా ఉన్నాయి. బాపట్ల డివిజన్‌లో ఎల్టీ కేటగిరిలో మొత్తం బకాయి రూ.37.89 కోట్లు కాగా ప్రభుత్వ బకాయి రూ.23.05 కోట్లు, ప్రభుత్వేతర బకా యి14.83 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. చీరాల డివిజన్‌లో ఎల్‌టీ కేటగిరిలో మొత్తం బకాయి 23.42 కోట్ల రూపాయలు కాగా ప్రభుత్వ బకాయి రూ. 8.63 కోట్లు, ప్రభుత్వేతర బకాయి 14.79 కోట్ల రూపాయలు గా ఉంది. హెచ్‌టీ కేటగిరి లో అద్దంకి డివిజన్‌లో మొత్తం బకాయి. ప్రభుత్వేతర బకాయే 63.58 కోట్ల రూపాయలుగా ఉం ది. బాపట్ల డివిజన్‌లో 29.63 కోట్ల రూపాయలు కాగా ప్రభుత్వ బకాయి13.15 కోట్ల రూపాయలు, ప్రభుత్వేతర బకాయి 16.48 కోట్లరూపాయలుగా ఉంది. చీరాల డివిజన్‌లో మొత్తం బకాయి 15.91 కోట్ల రూపాయలు కాగా ప్రభుత్వ బ కాయి 0.81 కోట్ల రూపాయలు, ప్రభుత్వేతర బకాయి 15.10 కోట్ల రూపాయలు గా ఉంది. బకాయిలు పెద్దమొత్తంలో పేరుకు పోవటంతో విద్యుత్‌శాఖ ఉన్నతా ధికారులు ఇటీవల నిర్వహించిన సమీక్ష లో వసూలు పై ప్రత్యేక దృష్టి పెట్టారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ భర్త మృతి


అద్దంకి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో పాటు జీవనం భారంగా మారడంతో జీవితంపై విరక్తి చెందిన వృద్ధ దంపతులు పిడూరి సత్యనారాయణ, జయలక్ష్మి దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. కాగా చికిత్స పొందుతూ భర్త పిడూరి సత్యనారాయణ(70) సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. భార్య ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతోంది. పోలీసుల కథనం మేరకు..., అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌లో నివాసం ఉండే సత్యనారాయణ, జయలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు. ఆయన గుంటూరులోని ఓ ప్రయివేటు కంపెనీలో చిరుఉద్యోగిగా పనిచేస్తున్నారు. వృద్ధ దంపతులు అద్దంకిలోని రామ్‌నగర్ లో సొంత ఇంటిలో ఉంటున్నారు. భార్యకు పక్షవాతం రావడం, భర్తకు అనారోగ్య సమస్యలు ఉండడంతో కుమారుడు పలుమార్లు కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించి చికిత్సలు చేయించారు. అయితే ఆరోగ్య సమస్యలు వెంటాడుతునే ఉండడంతో జీవితంపై విసుగు చెందిన వృద్ధ దంపతులు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో వైద్యం అందించే కాంపౌండర్ ఇంటికి రాగా దంపతులు పురుగు మందు తాగిన విషయాన్ని చెప్పారు. దీంతో విషయాన్ని కాంపౌండర్ వెంటనే కుమారుడు కృష్ణకుమార్‌కు ఫోన్ చేసి తెలిపాడు. స్థానికుల సాయంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ నుంచి ఒంగోలు రిమ్స్ కు తరలించారు. చికిత్స పొందుతూ సత్యనారాయణ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఒంగోలు రిమ్స్ నుండి వచ్చిన సమచారం మేరకు, కుమారుడు కృష్ణకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.


అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఉమామహేశ్వర్

చట్టపరిధిలో అర్జీలు పరిష్కరిస్తాం : ఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : చట్టపరిధిలో విచారించి అర్జీలను పరిష్కరిస్తామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి 54మంది అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్న ఎస్పీ వాటిని నిర్దిష్ట గడువులోగా చట్టపరంగా విచారించి పరిష్కారిస్తామని హామీనిచ్చారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని పోలీసు అధికారులను హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్‌ఎస్ సెల్ ఎస్సై ఎ.నాగేశ్వరరావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

యూరియా కొరతలేదు
-కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



బాపట్ల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరతలేదు కాబట్టి రైతులు నిర్భయంగా వచ్చి యూరియా పొందవచ్చుఅని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్ 35 కేంద్రాల ద్వారా 4983మంది రైతులకు 220 మెట్రిక్‌టన్నుల యూరియా పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఇంకా 220మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

స్మార్ట్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ : ఇన్‌చార్జ్ జేసీ గంగాధర్‌గౌడ్

కొత్త స్మార్ట్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతుందని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ తెలిపారు. స్మార్ట్ కార్డుల పంపిణీని సో మవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్డులను ప్రజల ఇంటి వద్దకే అందిస్తామని చెప్పారు. జిల్లాకు 4.71లక్షల స్మార్ట్ న్యూ రైస్‌కార్డులు వచ్చాయన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వచ్చి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డులు పంపిణీ చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి అమీర్‌బాషా, డీఎల్‌డీవో విజయమ్మ, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వత్, ఉపకలెక్టర్ లవన్న, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.

జాలర్ల నోట్లో మట్టికొడుతున్న
బుట్టల వేట


గుండ్లకమ్మ రిజర్వాయర్

- వైసీపీ హయాంలో విచ్చలవిడిగా సాగిన చేపల వేట
- కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న అదే పంథా!
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు
- మూడేళ్ల తరువాత గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ప్రారంభమైన చేపల వేట

అద్దంకి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో బుట్టలతో చేపల వేట సాగించకూడదనే నిబంధన ఉంది. అయినా యథేచ్ఛగా బుట్టలతో చేపల వేట సాగిస్తునే ఉన్నారు. వేట విరామ కాలం పూర్తయి చేపల వేట ప్రారంభమైన సోమవారం నుంచే గుర్తింపు కార్డులు ఉన్న జాలర్ల కంటే ముందే ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా కృష్ణా జిల్లా నుంచి వచ్చి స్థానిక రాజకీయ నేతల అండదండలతో బుట్టలతో జాలర్లు చేపల వేట సాగించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చాటుమాటుగా బుట్టలతో చేపల వేట సాగగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా గ్రామాల నేతల అండదండలతో బుట్టల వేట విచ్చల విడిగా సాగింది. అయితే డ్యామ్ గేట్లు కొట్టుకు పోవటంతో చివర్లో రెండు సంవత్సరాల పాటు రిజర్వాయర్‌లో నీరు నిల్వ లేక వేట జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు పూర్తి చేసి నీరు నిల్వ చేశారు. చేప పిల్లలను కూడా గత ఏడాది రిజర్వాయర్‌లో వదిలారు. అయితే చేప పిల్లలు పెద్దవి కావడానికి సమయం పడుతున్న నేపథ్యం లో గత ఏడాది కూడా చేపల వేట జరగలేదు. దీంతో మూడు సంవత్సరాల తరువాత సోమవారం నుంచి చేపల వేట ప్రారంభమైంది. జూలై, ఆగస్టు నెలలలో రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం నేప థ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి వేట ప్రారంభ మైంది. రిజర్వాయర్ ఆధారంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని మద్దిపాడు, చీమకుర్తి, తాళ్ళూరు, అద్దంకి, కొరిశపాడు మండలాలలోని సుమారు రెండు వేల జాలర్ల కుటుంబాలు వేట సాగించుకునే వీలుగా గుర్తింపు కార్డులు మత్స్యశాఖ అధికారులు ఇస్తుంటారు. స్థానికత ఆధారంగానే గుర్తింపు కార్డులు జారీ చేస్తారు. అయితే కృష్ణా జిల్లా నుంచి వచ్చిన సుమారు 50 కుటుంబాల జాలర్లు రిజర్వాయర్ పరిసరాలలోనే గుడిసెలు వేసుకొని నివాసం ఉంటూ ఆయా గ్రామాల నేతల అండదండలతో వేట సాగిస్తున్నారు. బుట్టలను వినియోగించి వేట సాగిస్తుండటంతో వల ద్వారా వచ్చే చేపల కంటే పెద్ద మొత్తంలో చేపలు పడుతుంటాయి. దీంతో నెల రోజుల లోపే రిజర్వాయర్ మొత్తంలోని అత్యధిక శాతం చేపల వేట పూర్తయ్యే అవకాశం ఉంది. రిజర్వాయర్ ఆధారంగా చేపల వేట సాగించే రెండు వేల జాలర్ల కుటుంబాలు మిగిలిన రోజులలో ఉసూరుమంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరో వారం పది రోజులు ఆగితే బుట్టలతో పాటు చిన్న కన్ను వలలతో కూడా వేట సాగించే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ అధికారులు మా త్రం అటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవటం విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బుట్టలు, చిన్న కన్ను వలల ద్వారా గుండ్లకమ్మ రిజర్వాయర్ లో చేపల వేట సాగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక జాలర్లు కోరుతున్నారు.


గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో పెట్టేందుకు సిద్ధం చేసిన ఇనుప బుట్టలు

కొనసాగుతున్న వరద ప్రవాహం

- వరద నీటిలోనే తల్లిదండ్రులతో ఇళ్లకు విద్యార్థులు


వరద నీటిలో పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

కొల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చిన్న రేవులోకి వరద నీరు ప్రవహిస్తూ దోనేపూడి కరకట్ట దిగువున పోతార్లంక చప్టాపైకి పారుతోంది. పాఠశాలలకు వెళ్లే తమ పిల్లల కోసం లంక గ్రామాల్లోని తల్లిదండ్రులు దోనేపూడి వచ్చి.. చప్టాపై ప్రవహిస్తున్న వరద నీటిలోనే ఇళ్లకు తీసుకెళ్తున్నారు. వరద చప్టాలపై వెళ్తున్న సమయంలో అక్కడ రాకపోకలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ, అక్కడ ఎవరూ కానరావడం లేదు. కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలు, పులిచింతలతో పాటు వాగులు, వంకలు ద్వారా 3.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. 3.97 లక్షల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీ నుంచి విడుదలైతే మొదటి ప్రమాద హెచ్చరిక, 5.67 లక్షలు క్యూసెక్కులు విడుదల చేస్తే రెండవ ప్రమాద హెచ్చరిక అధికారులు జారీ చేస్తారు. ప్రస్తుతం వరద ప్రవాహం నిలకడగా ఉందని మొదటి ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవసరం లేదని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



నూతనశాఖను ప్రారంభిస్తున్న సీజీఎం అరుణ్‌కుమార్

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు లక్ష్యమని ఏపీజీబీ డీజీఎం ఎం.అరుణ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చినగంజాం శాఖ నూతన కార్యాలయాన్ని నూతన భవనంలోనికి మార్చిన సందర్భంగా సోమవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖాతాదారుల సహకారంతోనే బ్యాంకు అభివృద్ధి చెందుతుందన్నారు. ఖాతాదారులకు ఆర్థికంగా చేయూతనివ్వడమే బ్యాంకు లక్ష్యమని అరుణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ సయ్యద్ యూసఫ్‌అలీ, బ్రాంచ్ మేనేజర్ కె.మధుసూధనరావు, మేనేజర్ డి.పోతురాజు, సిబ్బంది ఎస్.శిరీష టి.నాగఫణీంద్ర, షేక్.జానిబేగం, మురళిసింగ్, అనిల్‌కుమార్, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థికాభివృద్ధి చెందాలి



ఎగ్ కార్ట్ బండిని ప్రారంభిస్తున్న పొద వీరయ్య

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు అన్నారు. స్థానిక సోపిరాల రైల్వేగేటు కూడలిలో వెలుగు డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్ కార్ట్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం గడ్డె పెదసుబ్బారావు మాట్లాడుతూ గ్రామంలోని శ్రీరామ గ్రూపులోని గుండూరి సృజన అనే డ్వాక్రా మహిళకు షాపు పెట్టుకొనేందుకు ఉచితంగా రూ.50 వేలను అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెనూర్ అనే లక్ష్యం కింద దీనిని ఇచ్చినట్లు తెలిపారు. ఒకే కుటుంబంలోని ఇద్దరు పని చేసుకుంటూ దీని మీద బతకవచ్చన్నారు. నెలకు సుమారుగా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు సందు శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారిధి, నరహరి శ్రీనివాసరావు, గుండ్రెడ్డి నరసింహారావు, పల్లపోలు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువకుడి ఆత్మహత్య

బల్లికురవ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రేమవివాహం వాయిదాపడడంతో జీవితంపై విరక్తి చెందిన కొమ్మినేనివారిపాలేనికి చెందిన బొజ్జా ఎబేపరరావు(20) ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు కొమ్మినేనివారిపాలెం ఎస్టీ కాలనీకి చెందిన ఎబేపరరావు ఒక యువతిని ప్రేమించి ఆమెతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. వివాహం రోజురోజుకు వాయిదా పడుతుండడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 9న ఎలుకల మందు తిని అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఒంగోలు వైద్యశాలకు తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



హిమబిందుతో ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన పి.హిమబిందు ఎంపికైంది. జిల్లా జూనియర్ పోటీలు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరగ్గా, అక్కడ హిమబిందు ఉత్తమంగా రాణించింది. దీంతో ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, సోమశేఖర్, దేవభిక్షం, శ్రావణి ప్రత్యేకంగా అభినందించారు.

చెన్నుపల్లికి విశ్వకర్మ ఐకాన్ అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న శ్రీనివాసాచారి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వకరమ్మ ఐకాన్ అవార్డుకు ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేటలో ఆదివారం విరాట్ విశ్వకర్మ విజ్ఞాన అధునిక ధార్మిక కళాపరిషత్, ఇండియాన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. శ్రీనివాసచారికి సిద్ధిపేట వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పీఠాధిపతులు వీరజ ధర్మేంద్రస్వామి, బతుకమ్మతల్లి గ్రంథకర్త వంగల శాంతి కృష్ణలు అవార్డు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, పలు జిల్లా సంఘ నాయకులు పాల్గొన్నారు.

వెండితెర అవార్డు అందుకున్న నిర్మాత సందిరెడ్డి



వెండితెర అవార్డు అందుకుంటున్న సందిరెడ్డి శ్రీనివాసరావు

అద్దంకి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీవీ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెండితెర అవార్డులలో అద్దంకి పట్టణానికి చెందిన సినీ నిర్మాత సందిరెడ్డి శ్రీనివాసరావుకు దక్కింది. విజయవాడ సమీపంలోని కేఎల్ యూనివర్శిటీలో ఆదివారం రాత్రి జరిగిన వెండితెర అవార్డుల కార్యక్రమంలో సందిరెడ్డి శ్రీనివాసరావు రూపొందించిన జై జవాన్ డాక్యుమెంటరీ ఫిల్మ్‌కు దక్కింది. నిర్మాత శ్రీనివాసరావు అవార్డును పలువురు నటీనటుల చేతుల మీదగా అందుకున్నారు. వెండితెర అవార్డు అందుకున్న సందిరెడ్డి శ్రీనివాసరావు కు పలువురు అభినందనలు తెలిపారు.

మహిళా దొంగల ముఠా అరెస్టు

● రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం



పట్టుబడిన కారు, నగదుతో డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్, సిబ్బంది

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంకుల వద్ద రెక్కీ నిర్వహించడం, పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి ఆ సొమ్ము కాజేయడం మొదలెట్టారు. అలా.. 14 రోజుల వ్యవధిలో వేర్వేరు రాష్ట్రాల్లో ఏకంగా 10 చోరీలు చేశారు. అందుకోసం రెండు కార్లను తీసుకుని, ఇద్దరు డ్రైవర్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఆఖరుకు ఆ మహిళా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా ఆట కట్టించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గర్ జిల్లా కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన దీప్ మాలా బాయి, ఫరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, కారు డ్రైవర్ ప్రదీప్ సిసోడియా పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప.. దొంగల ముఠా అరెస్టు వివరాలను సోమవారం వెల్లడించారు. కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రెండు కార్లను తీసుకుని, చోరీలు మొదలెట్టారు. ఈనెల 3న గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్టేట్ బ్యాంకు(గోరంట్ల శాఖ)లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు. మధ్యలో ఓ దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆయనను బ్యాంకు వద్ద నుంచే రెండు కార్లలో మహిళా ముఠా వెంబడించింది. దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ద్విచక్రవాహనంలోని రూ.3.80 లక్షల నగదును చోరీ చేశాయి. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్, ఎస్‌ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. దీప్ మాలాబాయి, ఫరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, మరో ఇద్దరు మహిళలు, ప్రదీప్, మరో కారు డ్రైవర్ ముఠా చోరీ చేసినట్లు గుర్తించారు. గోరంట్ల మండలంలో జాతీయర రహదారి పక్కనే కె హోటల్ వద్ద ఆదివారం ఐదుగురు మహిళలు, కారు డ్రైవర్ ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వరుస చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈనెల 3వ తేదీ మధ్య ఏకంగా పది చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. కడప జిల్లా పులివెందుల, జమ్మలమడుగులో మూడు, తెలంగాణలో మూడు, నంద్యాల జిల్లా, కర్ణాటక, ఒడిశాలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున మొత్తం పది చోరీలు చేసి, రూ.12.59 లక్షలు అపహరించారు. వారి నుంచి మొత్తం 7.50 లక్షలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు.. కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన సీఐ శేఖర్, ఎస్‌ఐ రామచంద్రయ్య పేర్లను రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో చొరవ చూపిన కానిస్టేబుళ్లు వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, హోంగార్డు ప్రియాంకకు నగదు బహుమతులను డీఎస్పీ అందజేశారు. ముఠాలో మరో ఇద్దరు వహిళలు, డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

అనధికార నిర్మాణాలకు అనుమతులపై సీరియస్

● పూర్వ కమిషనర్, ఏసీపీలపై చర్యలకు ఆదేశం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం హయంలో ఒంగోలు కార్పొరేషన్, టౌన్‌ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకున్న అవకతవకలు, అవినీతిపై పురపాలక శాఖ సీరియస్ అయినట్లు సమాచారం. అప్పటి నగర కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (రిటైర్డ్) కే.వెంకటేశ్వర్లుపై చర్యలకు ఆదేశించింది. నగరంలోని పలు భవన నిర్మాణాల్లో నిబంధనలు అతిక్రమించి నిర్మించుకునేందుకు వీరు పరోక్షంగా ప్రోత్సహించారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో జరిగిన అవినీతిపై హైకోర్టు న్యాయవాది డి.ఎస్.సుబ్బారావు విజిలెన్స్, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలు కార్పొరేషన్‌కు సంబంధించి ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) కట్టకుండానే బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. అందులో ప్రధానంగా బండ్లమిట్ట టీబీ రోడ్ కూడా ఉండగా, నగరంలోని ఊరచెరువు, అద్దంకి బస్టాండ్‌లో నిర్మించిన షాపింగ్ మాల్స్ పలు ప్రాంతాల్లోనూ అనుమతులు లేకుండా జీ+2 పర్మిషన్ తీసుకుని అదనపు అంతస్తులు నిర్మించడంపైనా ఫిర్యాదులు ఉన్నాయి. వ్యాపార సంస్థల నిర్మాణాలకు భవన నిర్మాణం ఖర్చులో 10 శాతం కార్మిక శాఖకు లేబర్ సెస్ రూ.కోట్లలో చెల్లించాల్సి ఉండగా, మొక్కుబడిగా సెస్ విధించి రూ.కోట్లు దిగమింగేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో కార్పొరేషన్‌కు, కార్మిక శాఖకు భారీ నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేయడంతో అవినీతి బయటపడింది. దీంతో పూర్వ కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, ఏసీపీ కేవీలపై చర్యలకు ఆదేశిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

'సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేదలకు అండ'

మద్దిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే విజయకుమార్ చెప్పారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 21 గ్రామాలలో 85 మందికి ఆ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పుగుండూరి నాగేశ్వరావు, మండవ జయంత్ బాబు, అడక స్వాములు, మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, మండవ వెంకటస్వామి, మన్నం రాజా, మన్నం కృష్ణ, దాసరి శిల్పా సౌందర్య, దాసరి రమేష్ బాబు, మార్నేని సుబ్బారావు, మార్నేని కృష్ణారావు, మార్నేని రాఘవరావు, దుగ్గినేని నరసింహారావు, మోనపాటి రామకృష్ణ, గడ్డం రవి, మండవ గోపినాద్ పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.332

ఒంగోలు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పొగాకు వేలంకేంద్రం 2లో సోమవారం జరిగిన వేలంలో పొగాకు మేలు రకం కిలో రూ.332 పలికింది. వేలానికి మొత్తం 1055బేళ్లు రాగా 881 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్ట ధర రూ.104 పలికింది.

పశువులకు గాలికుంటు టీకాలు



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ బ్రహ్మయ్య

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలల్లో చేపడుతున్న పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగపర్చుకోవాలని అద్దంకి పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ బ్రహ్మయ్య అన్నారు. సోమవారం మండలంలోని నాగులపాడు గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. పశుపోషకులు ఎటువంటి అపోహలకు పోకుండా పశువులకు టీకాలను వేయించాలని తెలిపారు.

ఘనంగా 'జేసీఐ' ముగింపు వేడుకలు

అలరించిన చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డు

సూరే ఏడుకొండలుకు కమలపత్ర అవార్డు



డాక్టర్ సీతారామయ్యతోపాటు పలువురిని సత్కరిస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వారోత్సవాల ముగింపు వేడుకలు సోమవారంరాత్రి ఘనంగా జరిగాయి. కాపు కల్యాణ మండపంలో జరిగిన వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లోని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఫ్యాన్సీ డ్రస్ పోటీలు ఆకట్టుకున్నాయి. ముగింపు సభలో జేసీఐ ఇంటర్నేషనల్ కమిషన్ చైర్మన్ ఎన్‌బీ హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు జేసీఐకి ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని, సంస్థ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని ఎంతో విజయవంతంగా నిర్వహిస్తారని అన్నారు. ఈ వారోత్సవాలలో సుమారు 70 పాఠశాలలకు చెందిన 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జేసీఐ టఅధ్యక్షుడు మేడిశెట్టి వెంకట సుబ్బారావు చెప్పారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డు, సూరే ఏడుకొండలుకు కమలపత్ర అవార్డు, డాక్టర్ అంజనీ ప్రియదర్శినిని అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు, గంధవళ్ల రాధా రమణకు సూపర్‌కిడ్ అవార్డులతో సత్కరించారు. అదేవిధంగా పలువురిని ప్రొఫెషనల్ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో వారోత్సవాల చైర్మన్ శివకోటి రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి, మాంటిస్సోరి పి.ప్రకాష్ బాబు, జేసీ వీక్ కో చైర్మన్ గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్లు ఆత్మకూరు బ్రహ్మయ్య, బొమ్మల శ్రీనివాస రావు, డాక్టర్ జి.రవికుమార్, ఎన్.రామకృష్ణ, కే.వరుణ్ కుమార్, వి.వి.రమణ, మాజేటి గణేష్ పాల్గొన్నారు.

'బౌద్ధంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానులే'



బౌద్ధ ధర్మంపై ప్రచారం చేస్తున్నసభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమని, సర్వమానవ సమానత్వం, సర్వజీవ కారుణ్యం ప్రధానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బౌద్ధ ధర్మ ప్రచారకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో బౌద్ధ ధర్మ ప్రచార యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐసీడీఎస్ ఆర్‌జేడీ రాఘవరావు మాట్లాడుతూ 2600 ఏళ్ల క్రితమే స్త్రీ, పురుష సమానత్వాన్ని, సర్వమానవ సమానత్వాన్ని గౌతమ బుద్ధుడు తన భిక్షు సంఘంలో అమలు చేశారన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల హరిప్రసాద రావు, దాసరి సుందరం, బి.సుబ్బారావు, జార్జి, ప్రసాద్, జి.నాగేశ్వర రావు పాల్గొన్నారు. అంతకు ముందు రాజపానగల్ రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభమై కొణిజేడు బస్టాండు, గద్దల గుంట మీదుగా మామిడిపాలెం అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు.

సొసైటీ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేస్తున్న కొండలరావు

పొన్నలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పీఏసీఎస్‌కు సొంత భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని చైర్మన్ ఉన్నం కొండలరావు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సొసైటీలో సుమారు 14 వేలకుపైగా రైతులు సేవలు పొందుతున్నారన్నారు. రూ.12 కోట్ల మేర రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సొసైటీకి సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనం నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కొండలరావు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి స్వామి.. సొసైటీకి అనువుగా ఉండేలా స్థలం కేటాయించాలని స్థానిక తహసీల్దార్ పుల్లారావును ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పల్లపోతు రమేష్‌బాబు, దాసరి కృష్ణారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

తైక్వాండోలో కారుమంచి యువకుల సత్తా

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కారుమంచి గ్రామానికి చెందిన మేడికొండ మణికంఠం, గాలి శివరామకృష్ణ అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటారు. ఈనెల 13,14 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో మేడికొండ మణికంఠ బంగారు, గాలి శివరామకృష్ణ రజత పతాకాన్ని సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డాన్ దగ్గుమాటి విజయ్ ఇరువురినీ ప్రశంసించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

పొన్నలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ జె.శివరామకృష్ణ సూచించారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను పరిష్కరించాలని టీచర్ల నిరసన



మండల కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ కొండపి జోన్ ఆధ్వర్యంలో టంగుటూరులోని మండల ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారథి, మండలాల శాఖల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పోలేరమ్మ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి పోలేరమ్మ ఆలయంలోని హుండీ కానుకలను బుధవారం లెక్కిస్తామని ఆలయ ఈవో భైరాగి చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ, బ్యాంకు అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు.

సీఎం కాన్ఫరెన్స్‌లో జేసీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో సోమవారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను ప్రత్యక్ష ప్రసారాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీక్షించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా వివిధ అంశాలపై కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేస్తున్నారు. అందుకు సంబంధించి ప్రత్యేక టైం టేబుల్‌ను కూడా రాష్ట్ర అధికారులు రూపొందించారు. ఆయా వివరాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాలని ఆదేశించారు.

రణభేరీ పోస్టర్ల ఆవిష్కరణ



రణభేరీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంకోరుతూ యూటీఎఫ్ నిర్వహించనున్న రణభేరి వాల్‌పోస్టర్లను సోమవారం టీచర్లు ఆవిష్కరించారు. మండలంలోని గమండ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు రవి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బైకు జాతర కార్యక్రమం నిర్వహించనన్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు కొండారెడ్డి, ప్రభాకరరెడ్డి, ఉమామహేశ్వరరావు, జయరామిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, మూర్తి పాల్గొన్నారు.

చీమకుర్తిలో మై టీడీపీ యాప్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు బహుళప్రయోజనం చేకూర్చే మై టీడీపీ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం చీమకుర్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పట్టణపార్టీ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, పూనాటి వెంకట్రావు, అవగనిగడ్డ శేషయ్య, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, పిచ్చయ్య, నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనంనేనివారిపాలెంలో కమ్యూనిటీహాలు ప్రాంగణం వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాయపూడి కోటయ్య, వేమా చిన్న కోటేశ్వరరావు, పారాబత్తిన పేరయ్య, యలమందయ్య, బాలకోటేశ్వరరావు, ప్రభాకర్, కొండలరావు పాల్గొన్నారు.

రేపు పల్లామల్లి సొసైటీ మహాజన సభ

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లామల్లి సహకార సొసైటీ సంఘం మహాజన సభను 17వ తేదీన సొసైటీ ఆవరణలో నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పారా చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీలో సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ..

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికలు

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఖాజీపాలెం కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగిరెడ్డి స్వామిరెడ్డి, మారుబోయిన వెంకటరెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి, పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ జట్లుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న ఉదయం 8గంటల లోపు క్రీడాకారులు హాజరు కావాలన్నారు. 13వ తేదీ వర్షం కురిసిన కారణంగా అథ్లెటిక్స్ ఎంపికలు 14వ తేదీన నిర్వహించలేదని తెలిపారు. పూర్తి వివరాలకు 9542354041, 7416825797 నంబర్లను సంప్రదించాలని వెంకటరెడ్డి తెలిపారు.

కొప్పెరపాడులో స్కూల్ గేమ్స్ పోటీలు



బల్లికురవలో లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థి

బల్లికురవ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా తరఫున పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్‌లు ప్రారంభించారు. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాలలో వాలీబాల్, కబడీ, లాంగ్ జంప్, హైజంప్ పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను డివిజన్ స్థాయికి పంపుతామని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యాయమ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్చరీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

● సత్తాచాటిన హారిజన్ స్కూల్ విద్యార్థులు



అభినందన సభలో మాట్లాడుతున్న రవికుమార్

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీల్లో ఆర్చరీ విభాగంలో వేటపాలెం హారిజన్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ప్రదర్శన చేసిన జాన్‌వెస్లీ, నవదీప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన అభినందనసభలో పాఠశాల కార్యదర్శి డాక్టర్ పొగడదండ రవికుమార్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన ఈ ఆర్చరీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. వారి వెంట ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ పిఎల్ రాజు, చుక్కా శ్రీను, రాంబాబు, జయలక్ష్మీ, ఏబీఎం కళాశాల ప్రిన్సిపల్ శ్రీవాణి తదితరులు ఉన్నారు.

స్కూలుకు ఫర్నీచర్ బహూకరణ



పాఠశాలకు అందజేసిన ఫర్నీచర్‌తో దాత

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఎడిన్ ఛారిటబుల్ ట్రస్ట్‌వారు రూ.10 వేల విలువైన ఫర్నీచర్‌ను బహుకరించారు. వారు స్కూలుకు 5 ఎస్ చైర్ లు, ఒక టేబుల్ ను బహుకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లేళ్లపల్లి సుధీరా వెంకటేశ్వర్లు, లేళ్లపల్లి సుబ్బారావు లు, ఎంఈవో చిలుకూరి గోపి, ఉపాధ్యాయులు పోపూరి సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శనతో మానసిక ఉల్లాసం



అన్న వితరణ చేస్తున్న సీఐలు

పేరాల(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పనిభారంతో తలమునకలైన సమయంలో ఆలయాలు సందర్శించడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని సీఐలు సుబ్బారావు, నాగభూషణం పేర్కొన్నారు. పేరాల శ్రీగంగా భ్రమరాంబ సమేత పునుగు రామలింగమల్లేశ్వర స్వామి దేవస్థానం పెద్దరథం కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సీఐలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు స్వయంగా వడ్డించారు. గత 27 వారాలుగా జరుగుతున్న అన్నవితరణకు సోమవారం నిహారిక , మరో దాత నాగార్జున లు సహకరించారు. కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు అన్నదాత పాండురంగారావు, భాస్కరరావు, రమేష్‌బాబులు పర్యవేక్షించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండలోని శ్రీరామ వృద్దుల ఆశ్రమంలో వృద్ధులకు అన్న దానం నిర్వహించారు. వజ్జాఅశోక్ జ్ఞాపకార్థం తండి వజ్జా వెంకట్రామయ్య సౌజన్యంతో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించినట్లు క్లబ్ కార్యదర్శి అలహరి హరి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, అంజాద్ బాషా, వెంకట్రామయ్య దంపతులు తదితరులు పాల్గొన్నారు.

18న మండల స్థాయి శతక పద్య పోటీలు

పంగులూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18న మధ్యాహ్నం శతకపద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం ఎం.వడ్లమూడి వేణుబాబు తెలిపారు. 4, 5, తరగతులకు, 6, 7, తరగతుల విద్యార్థులకు వేమనశతక పద్యాలపై, 8, 9, తరగతుల విద్యార్థులకు సుమతీ శతక పద్యాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో ప్రతి పాఠశాల నుంచి ఒక్కో విభాగం నుంచి ఒక విద్యార్థి ఈ పోటీలలో పాల్గొనవచ్చున్నారు.



నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది, అంబడిపూడిలో ఏర్పాటు చేస్తున్న నూతన లైన్లు, గుంటుపల్లిలో త్రీఫేస్ లైన్, పక్కన పడేసిన పాత విద్యుత్ స్తంభాలు, పనులను పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

● నూతన స్తంభాలు, తీగల ఏర్పాటు
● 24 గంటలు గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్ ఉండేలా ప్రత్యేక లైన్
● పంటలకు, గృహాలకు వేర్వేరుగా లైన్లు

విద్యుత్ సమస్యలను పరిష్కరించేలా..!

బల్లికురవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు శిథిలావస్థకు చేరాయి. కొన్ని గ్రామాలలో ఇనప చువ్వలు కూడా బయటపడి గాలులకు స్తంభాలు విరిగి పడేలా ఉన్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు లో-వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉండేది. దీనిపై దృష్టిసారించిన ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా ప్రత్యేక లైన్ల పనులను శరవేగంగా చేయిస్తోంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పలుగ్రామాల్లో జోరుగా పనులు సాగుతున్నాయి.

మండలంలోని గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, కొణిదెన, నక్క బొక్కలపాడు, బల్లికురవ, మల్లాయపాలెం తదితర గ్రామాలలో రెండు మాసాల నుంచి ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా ప్రత్యేక విద్యుత్ లైన్ల పనులు చేపడుతున్నారు. గ్రామాలలో సుమారు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాత స్తంభాలను తొలగించి బాగా ఎత్తుగా ఉన్న స్తంభాలను ఏర్పాటు చేసి కొత్త వైర్లు కూడా వేస్తున్నారు. దీనికి తోడు గతంలో గ్రామాలలో సింగిల్ ఫేస్ విద్యుత్ మాత్రమే ఉండేది. ఇప్పుడు ప్రత్యేక లైన్ల వలన వ్యవసాయానికి ప్రత్యేక లైన్‌తో పాటు గృహాలకు సైతం త్రిఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనివలన గ్రామాలలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. అలానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మేరకు విద్యుత్ స్తంభాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. లైన్ల ఏర్పాటులో భాగంగా అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలను సైతం తొలగిస్తుండడంతో ముందు ముందు విద్యుత్ సరఫరాలో లోపాలు కూడా వచ్చే సమస్య ఉండదు అని అధికారులు అంటున్నారు. గతంలో ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను తీసి వేసి కొత్తగా 100 కేవీ త్రిఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు అన్ని పూర్తి అయితే గ్రామాలలో విద్యుత్ సమస్యలు తొలగి పోతాయని ప్రజలు అంటున్నారు. గ్రామాలలో జరుగుతున్న విద్యుత్ లైన్ల పనులను అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మార్టూరు ఏడీఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, గ్రామాల విద్యుత్ సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు. కొన్ని గ్రామాలలో చేపట్టిన పనులు పూర్తి కాగానే మిగిలిన గ్రామాలలో చేయిస్తామని అధికారులు అంటున్నారు.

ఘనంగా ఇంజనీర్స్‌డే



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

చీరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మానవుడు ప్రపంచాన్ని చుట్టేయగలడనే నమ్మకాన్ని నిలబెట్టింది ఇంజనీర్స్ అని, వారి గొప్పతనం అసాధరణమని ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం సమావేశం హాలులో ఇంజనీర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లను సత్కరించారు. కార్యక్రమంలో డీఈ రాఘురామ్, వైస్ చైర్మన్ సుబ్బయ్య, టీపీవో శ్రీనివాసులు, ఏఈ రవికుమార్, శరత్, విజయ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న అతిథులు

సెయింట్ ఆన్స్ కళాశాలలో..

చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ జగదీష్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డే నిర్వహించారు. కార్యక్రమానికి బాపట్ల ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిప్రసాదరావు, డిప్యూటీ ఇంజనీర్ నళినీ, హైదరాబాదు ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన అందించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నిరసన



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అద్దంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ అద్దంకి జోన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, మెమో నెం.57ను అమలు చేయాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కంకణాల శ్రీనివాసరావు, మాడుగుల కిషోర్‌బాబు, మలాది నాగరాజు, జి. ఎలీషా, కరి రామయ్య, రమేష్‌బాబు, మల్లికార్జునరావు చెంచు రామారావు, రహమ్‌తుల్లా పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల వినతి

ఇంకొల్లు : ఇంకొల్లు మండలంలోని సచివాలయ ఉద్యోగులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసును కలిసి తమ సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంటింటికి తిరిగి చేసే సేవలు, సర్వేల నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ఉండేలా విధులను కేటాయించాని విన్నవించారు. తహసీల్దారు శ్రీనివాస్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రోటరీ ఆధ్వర్యంలో విత్తన బంతుల తయారీపై శిక్షణ



విత్తన బంతులను తయారుచేస్తున్న విద్యార్థులు

పంగులూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మట్టితో విత్తనబంతులను తయారు చేసి మొక్కలపెంపకం చేపట్టే విధానంపై రోటరీక్లబ్ ప్రతినిధులు పాఠశాల విద్యార్థులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని పంగులూరు, కొండమంజులూరు ఉన్నత పాఠశాలల్లో చిలకలూరిపేటకు చెందిన విశ్రాంత లెక్చరర్, రోటరీప్రతినిధి లక్ష్మీనారాయణ విత్తనబంతులను తయారు చేసే విధానం, తద్వారా మొక్కల పెంపకం గురించి విద్యార్థులకు వివరించారు. ఎర్ర మట్టితో కంపోస్ట్ ఎరువులు కలిపి వాటిని బంతులుగా తయారుచేసి ఆబంతిలో ఓ విత్తనం వేసి చెట్లులేని ప్రాంతంలో బంతులు వేస్తే మొక్కలు ఏర్పడి చెట్లుగా ఎదుగుతాయన్నారు. గానుగ, వేప, తురాయి, నేరేడు విత్తనాలతో విద్యార్థులకు విత్తన బంతులు తయారు చేయించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు విద్యార్థులు విత్తన బంతులు తయారు చేసి, రోడ్లవెంట, చెట్లు పెంచేందుకు అనువుగా ఉన్న ఖాళీ ప్రదేశాలలో చెట్లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు సోమేపల్లి శ్రీనివాసరావు, ఐ.అనిత, రావిశ్రీనివాసరావు, మేరీశ్యామల, శ్రీనివాసకుమార్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పూర్తిచేయండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

మార్టూరు, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉన్న కేసులను వీలయినంత త్వరితంగా పూర్తిచేయాలని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. సోమవారం ఆయన మార్టూరు స్టేషన్ లో వార్షిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ లో ఉన్న కేసులకు చెందిన రికార్డులను పరిశీలించారు. వాటిలో పురోగతి సాధించిన కేసుల వివరాలను సీఐ యం శేషగిరిరావును అడిగి తెలుసుకున్నారు.అంతేగాకుండా స్టేషన్ పరిదిలో శాంతి భద్రతలు, సెంటర్లో ట్రాఫిక్,స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల ప్రవర్తన తదితర విషయాల గురించి ఆయన సీఐ తో చర్చించారు.స్టేషన్ పరిదిలో లోక్ అదాలత్ లో పరిష్కారయిన కేసుల గురించి ప్రస్తావించారు.ఇంకా పలువిషయాలపై వివ రాలను తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదా,ఏఎస్ఐ భాషా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలి

● రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

మార్టూరు, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):భూ రెవెన్యూ సమస్యలను త్వరితంగా పరిష్కరించకపోవడంతోరైతులు ఇబ్బందులు పడుతున్నారని సోమవారం మండల తహసిల్దారు కార్యాలయం వద్ద ఏపి రైతు సంఘం మండల కమిటి నాయకులు ధర్నా చేశారు.అనంతరం వారు తహసిల్దారు టి ప్రశాంతికి వినతి పత్రం అందచేశారు.ఈ వినతి పత్రంలో మొదటి విడత రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తామని,ఈ ఏడాది జనవరి నెలలో గ్రామ సభలు నిర్వహించిరైతుల దగ్గర దరఖాస్తులు తీసుకున్నారని,కాని ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు.అందువలన రీసర్వేలో జరగిన పొరబాట్లు,జాయింట్ ఎల్‌పి లు,ఈ నాం భూములు,ఎస్టేట్ భూములు, చుక్కలు భూములు తదితర సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు,బత్తుల హనుమంతరావు,గోనుగుంట్ల మోహనరావు,ఇందుర్తి నాగేశ్వరరావు,బోడపాటి సూరిబాబు,సాంబయ్య,రాంబాబు ,వీ రవల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నీటిశుద్ధిలో నిబంధనలు గాలికి

అనధికారిక స్టిక్కర్లతో విచ్చలవిడిగా విక్రయాలు

చీరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మినరల్ వాటర్ మాయాజాలం ఆకాశాన్నంటుతోంది. అనధికార నీటిశుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రజారోగ్యాన్ని కాలరాస్తున్నారు. నీటిశుద్ధిలో నిబంధనలు పాటించకుండా కాసుల వేట సాగిస్తున్నారు. విచ్చలవిడిగా డ్రికింగ్ మినరల్ వాటర్ పేరుతో అనధికార స్టిక్కర్స్ ముద్రించి ప్రజలను మోసగిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా పలు రెస్టారెంట్లు, హోటల్స్‌లో, దుకాణాల్లో నకిలీబ్రాండ్లు జోరందుకున్నాయి. కొందరు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు కూడా నిబంధనలకు పాతర వేశారు. ప్రస్తుతం ఈ తరహా సంస్థలు కోకొల్లలు మార్కెట్‌లో వెలిశాయి. నిబంధన ప్రమాణాలు లేని నీటిని ప్లాస్టిక్ బాటిల్స్‌లో నింపి విక్రయాలు చేస్తున్నారు.

నిబంధనలు గాలికి..

తాగునీరు తయారీ కేంద్రంలో ఏసీతో పాటు కెమికల్, బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గదిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ స్టెయిన్‌లెస్ స్టీలుతో అమర్చి ఉండాలి. సంబంధిత అధికారులు ప్రతి మూడు నెలలకు ఆ ప్లాంట్ నిర్వహణలో శాంపిల్స్ పరిశీలించాలి. ఈ నేపథ్యంలో నిబంధనలు అమలు జరుగుతున్నప్పుడే నిర్వహణ కొనసాగించాలి. అలాగే ప్లాంట్‌లో క్లోరినేషన్ తప్పనిసరిగా పాటించాలి. ఫిల్టర్స్ శుభ్రత నిత్యం ఉండాలి. అయితే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపుగా ఈ తరహా నిబంధనలు ఆచరించడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారీతిగా నాసిరకం నీరు బాటిళ్లలో నింపి డబ్బులు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటీవల కాలంలో ప్లాంట్‌ల నిర్వహణపై అధికారుల తనిఖీలు శూన్యం. నీటిశుద్ధి లోపించిన నీటి విక్రయాలు జరుగుతన్న బహిరంగ రహస్యమే అయినా తనిఖీలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్ తహసీల్దార్ కోసం వినతి

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం తహసీల్దార్ కార్యాలయానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని పలువురు వైసీపీ నేతలు కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రెండు మండలాలకు సంబంధించి ఒకే అధికారి ఉండడంతో విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికేట్స్ సైతం జాప్యం జరుగుతున్నట్లు వారు తెలిపారు.

54వ గంధ మహోత్సవం

చీరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైకుంఠపురం దర్గా పరిధిలో 54వ గంధ మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి కంబల్ ఫాతెహా, గురువారం రాత్రి గంధం ఊరేగింపు, అదేరోజు అన్నదానం, శుక్రవారం భక్తులకు గంధం పంపిణీ, శనివారం ప్రసాద వితరణ పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెరగాలి



విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఎంఈవో

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చదువును విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేలా పాఠశాలలో బోధించి సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కేవీ.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పట్టణలోని సత్రంబడిని ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం పథకం రోజువారి మెను అమలు చేయాలన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పాఠశాల ఉపాధ్యాయురాలు ధనలక్ష్మిని ఎంఈవో, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గర్నెపూడి శ్యామ్‌కుమార్, బాబురావు, కొంగల శ్రీనివాసరావు, పాలపర్తి యోనా, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మహిళలకు శక్తి యాప్ రక్షణ కవచంలాంటిదని ఇంకొల్లు సీఐ వైవీ.రమణయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తియాప్, 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్', సైబర్ నేరాలు, ఆత్మరక్షణ, డ్రగ్స్, నార్కోటిక్స్ ప్రమాదాల గురించి చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. చీరాల శక్తి బృందం ఎస్ఐ ఏ.హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తక్షణం పోలీసు రక్షణ పొందేందుకు శక్తియాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరు తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని అన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌లు, బాల వివాహాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను అరికట్టే హెల్ప్‌లైన్ నంబర్లు 1972, 1098, 181, 112, 100ల గురించి వివరించారు. విద్యార్థులు 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శీలం రమేష్, చీరాల శక్తి బృందం సభ్యులు, పాఠశాల హెచ్.ఎం. కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు, సెప్టెంబరు 15,(ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్ తెలిపారు. సమావేశానికి మండల స్థాయిలోని అన్నీ శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు తమ రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.


ప్రభుత్వ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు

● ఎంపీడీవో కుసుమకుమారి హెచ్చరిక




పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రోడ్ల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా చెత్తవేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కుసుమకుమారి హెచ్చరించారు. బల్లికురవ బస్టాండ్ ఆవరణలో వ్యర్థాలను పెద్దఎత్తున వేయడంతో దుర్వాసన వస్తోందని సోమవారం స్థానికులు నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో పరిశీలించి వ్యర్థాలను గ్రామ పంచాయతీ ద్వారా తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బల్లికురవ గ్రామంలోని దుకాణాల వారు చెత్త ఎక్కడపడితే అక్కడవేస్తే వారికి అపరాధం విధిస్తామన్నారు. గ్రామాలలో ఉన్న చెత్తసంపద కేంద్రాలలో చెత్తను వేయాలన్నారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలన్నారు. పంచాయతీ సర్పంచ్ పందిరి అంజిబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరెడ్డిల పర్యవేక్షణలో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. బల్లికురవ కూడలిలో వ్యర్థాలు తొలగించడంపై దుకాణదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



సోమశిలకు 29,588 క్యూసెక్కుల వరద

అనంతసాగరం(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 29,588 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 74.400 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు గేట్ల ద్వారా 29,650, పవర్ టెన్నల్ నుంచి 2600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



స్కూళ్లకు కొత్త టీచర్లు

మెగా డీఎస్సీ-2025 తుది జాబితాను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. దీంతో జిల్లాలో ఉపాధ్యాయుల కొలువుల జాతర ప్రారంభమైంది. నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపుతూ జిల్లాలో 673 పోస్టులకు గానూ, 657 పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ కారణాల కారణంగా 16 ఖాళీల భర్తీకి తాత్కాలిక బ్రేక్ వేసినట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంతోపాటు కలెక్టరేట్‌లో డీఎస్సీ తుది జాబితాను ప్రదర్శనకు ఉంచారు. అలాగే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ఏపీడీఎస్సీ డాట్ ఏపీ సీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ సైట్‌లో కూడా అభ్యర్థుల ఎంపిక జాబితా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.

- మెగా డీఎస్సీ తుది జాబితా విడుదల
- జిల్లాలో 657 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ
- 16 ఖాళీల భర్తీకి తాత్కాలిక బ్రేక్
- డిసెంబరులో భర్తీకి అవకాశం



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లాలో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. ఈ నియామకాల్లో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లతోపాటు సబ్ క్లాసిఫికేషన్, స్పోర్ట్స్ కోటా 3శాతాన్ని కూడా అమలు చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల పరిధిలోని ఉపాధ్యాయ ఖాళీలతోపాటు గిరిజన, సాంఘిక సంక్షేమశాఖలు, మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసేలా పోస్టులను సిద్ధం చేశారు. వీరితోపాటు మోడల్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, దివ్యాంగుల పాఠశాలలు, జువైనల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం కంప్యూటర్ బేస్డ్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. అన్ని అభ్యంతరాల పరిశీలన అనంతరం, తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. వీరందరికీ ఈనెల 19న సీఎం నారా చంద్రబాబునాయుడు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌ల చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. అనంతరం వారికి దసరా సెలవుల సమయంలో (ఈనెల 22 నుంచి 29 వరకు) జిల్లాలోనే ప్రత్యేక శిక్షణ అందించి ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ కూడా అందచేయనున్నారు.

● అభ్యర్థులు డీఈవోకి రిపోర్టు చేయాలి

మెగా డీఎస్సీ-2025 తుది జాబితాలో ఎంపికైన అభ్యర్థులు ఈనెల 18న సాయంత్రం 5 గంటలకు వెంకటాచలం మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయ ట్రస్ట్ వద్ద తనకు తప్పనిసరిగా రిపోర్టు చేయాలని డీఈవో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులతో పాటు ఓ సహాయకుడు కూడా హాజరు కావాలన్నారు. అభ్యర్థులంతా వారికి అవసరమైన సామగ్రిని సమకూర్చుకున్న అనంతరం వారికి ఐడీ కార్డులు అందచేస్తామన్నారు. ఈ ఐడీ కార్డులు తీసుకుని ఈనెల 19న విజయవాడలో జరిగే సీఎం కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. అభ్యర్థులందరినీ ప్రత్యేక బస్సుల ద్వారా విజయవాడకు తీసుకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాబట్టి తప్పనిసరిగా రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు.

డిసెంబరులో మళ్లీ నోటిఫికేషన్

జిల్లాలోని అన్నీ మేనేజ్‌మెంట్ స్కూళ్లలో భర్తీ చేసిన పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లిష్ 83, హిందీ 18, తెలుగు 31, ఉర్దూ 5, బయాలజీ 62, మ్యాథ్స్ 64, ఫిజికల్ డైరెక్టర్లు 105, ఫిజికల్ సైన్స్ 75, సోషల్ 101 పోస్టులు ఉన్నాయి. అలాగే ఎస్‌జీటీ తెలుగు 109, ఉర్దూ పోస్టులు 4 కలిపి మొత్తం 657 భర్తీ అయ్యాయి. అలాగే ఎస్ఏ ఇంగ్లిష్ 2, తెలుగు 1, ఉర్దూ 2, ఫిజికల్ డైరెక్టర్స్ 2, ఫిజికల్ సైన్స్ 1, సోషల్ 2, బయలాజికల్ సైన్స్ 1, హిందీ 1, ఎస్‌జీటీ తెలుగు 1, ఉర్దూ 3 పోస్టులు కలిపి మొత్తం 16 పోస్టులు క్యారీ ఫార్వర్డ్ ఖాళీలుగా మిగిలాయి. వీటితో పాటు కొత్తగా ఏర్పడే ఖాళీలను కలిపి ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేసే డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



ఇంకా మెరుగుపడాలి..!

- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిరోజు జిల్లాల ప్రగతిపై చర్చ
- తొలి క్వార్టర్‌లో జిల్లా జీడీపీ 18.65 శాతంగా నమోదు
- ఇది రాష్ట్ర సగటు కన్నా తక్కువే...
- ఆయా రంగాల్లో కీలక అంశాలపై దిశానిర్దేశం

నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల నాలుగో కాన్ఫరెన్స్ సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమంలో తొలిరోజు రాష్ట్ర, జిల్లాల ప్రగతిపై చర్చించారు. ఏయే రంగాల్లో పురోగతి మెరుగ్గా ఉంది...? ఇంకా ఏయే రంగాల్లో పురోగతి మెరుగుకు చర్యలు తీసుకోవాలి...? వంటి అంశాలపై సీఎంతోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్(ఏప్రిల్-జూన్) ప్రగతి నివేదికలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం జిల్లా ఇంకా పలు రంగా ల్లో మెరుగుపడాల్సి ఉంది. 2025-26లో జిల్లా జీడీపీ లక్ష్యం రూ.92,705 కోట్లుగా పెట్టుకున్నారు. ఈ ఏడాది 16.56 శాతం గ్రోత్ రేటు పెంపు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. తొలి త్రైమాసికంలో జిల్లా రూ.17,294 కోట్ల జీడీపీని సాధించి 16వ స్థానంలో నిలిచింది. నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇది 18.65 శాతంతో సమానం. రాష్ట్ర సగటుతో పోలిస్తే జిల్లా సాధించిన ప్రగతి తక్కువ. రాష్ట్రం మొత్తం సరాసరి చూసుకుంటే తొలి త్రైమాసికంలో 19.18 శాతం జీడీపీ అచీవ్ అయ్యింది. అంటే జిల్లా రానున్న మూడు త్రైమాసికాల్లో 81.35 శాతం లక్ష్యం సాధించాల్సి ఉంది.



కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

రంగాల వారీగా చూసుకుంటే..

వ్యవసాయ రంగం తొలి త్రైమాసికం జీవీఏ లక్ష్యం రూ.33,790 కోట్లు కాగా, రూ.5062 కోట్లు సాధించింది. 14.98 శాతం అచీవ్‌మెంట్‌తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. వ్యవసాయ రంగంలో రాష్ట్ర సగటు జీవీఏ 13.52 శాతం కన్నా జిల్లా జీవీఏ ఎక్కువగా నమోదవడం విశేషం. 2025-26లో పారిశ్రామికరంగం జీవీఏ లక్ష్యం రూ.15586 కోట్లు కాగా, తొలి త్రైమాసికంలో రూ.3386 కోట్లు సాధించింది. 21.73 శాతం లక్ష్యాన్ని సాధించి 19వ స్థానంలో నిలవగా, ఇది రాష్ట్ర సగటు (23.35 శాతం) కన్నా తక్కువ కావడం గమనార్హం. ఇక జిల్లాలో సేవా రంగానికి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.35,732 కోట్లు జీవీఏ లక్ష్యంగా పెట్టుగా, తొలి త్రైమాసికంలో రూ.7577 కోట్లు సాధించింది. 21.21 శాతం అచీవ్‌మెంట్ సాధించి 20వ స్థానంలో నిలవగా, ఇది రాష్ట్ర సగటు(22.14 శాతం) కన్నా తక్కువగా ఉంది. అంటే వ్యవసాయ రంగంలో అనుకున్న మేర ప్రగతి సాధించినప్పటికీ పారిశ్రామిక, సేవా రంగాల్లో మాత్రం ఇంకా మెరుగుపడాల్సి ఉంది. కాగా స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు సంబంధించి జిల్లా అనుసరించిన మార్గాలు, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో జిల్లా కనబరిచిన పనితీరును కూడా ప్రభుత్వం లెక్కించింది. దీనికి సంబంధించి కూడా ప్రగతి నివేదికను విడుదల చేసింది. జిల్లాలు, మండలాల వారీగా స్కోర్‌తో పాటు ర్యాంకులను ప్రకటించింది. స్వర్ణాంధ్ర కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)లో జిల్లా స్కోర్ 63 పాయింట్లు కాగా 'బీ' గ్రేడ్ దక్కింది. ఈ స్కోర్ ప్రకారం వలేటివారిపాలెం మండలం 54 పాయింట్లతో రాష్ట్ర వ్యాప్తంగా కింద నుంచి పది మండలాల్లో ఒకటిగా ఉంది. ఈ కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రభుత్వం కలెక్టర్లకు అనేక అంశాలపై దిశానిర్దేశం చేసింది. ఎంఎస్ఎంఈ పార్కులపై ఎప్పటికప్పుడు సమీక్షించి, పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అలానే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన సంస్థలతో ప్రతీ 15 రోజులకు ఒకసారి సమీక్షించి, వారికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది.



నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ సమ్మెలో భాగంగా మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటసుబ్బారావు

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

● ఆగిన రిజిస్ట్రేషన్లు ● బోసిపోయిన కార్యాలయాలు ● ప్రభుత్వ ఆదాయానికి గండి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్ విధానంలో లోపాలు సరిచేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు సోమవారం జిల్లావ్యాప్తంగా పెన్‌డౌన్ సమ్మె ప్రారంభించారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలు లేక బోసిపోయాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా ప్రభుత్వానికి వస్తున్న ఆదాయానికి గండి పడింది.

నెల్లూరు నగరంలోని ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రాష్ట్ర దస్తావేజు సంఘం నేతలు, జిల్లా నేతలు, స్టాంపు వెండర్ల సంఘం నేతలు పెద్ద సంఖ్యలో పెన్‌డౌన్ సమ్మె చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకసుబ్బారావు మాట్లాడుతూ ఓటీపీని ప్రవేశపెట్టిన ప్రారంభంలో ఒకే ఒక్కసారి నమోదు చేసేవారన్నారు. కానీ ప్రస్తుత విధానంలో డేటా ఎంట్రీ చేస్తే ఓటీపీ ప్రతీసారి అప్ లోడ్ చేయాల్సి వస్తున్నదన్నారు. అన్నీ సరిచేసుకుని దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్‌కు దాఖలు చేస్తే సర్వర్ సమస్యతో దస్తావేజు చెక్ స్లిప్ రావడం లేదన్నారు. రిజిస్ట్రేషన్ కోసం మళ్లీ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేయాల్సి పరిస్థితి తలెత్తుతున్నదని వివరించారు. దీంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయని తెలిపారు. అలాగే కొత్తగా ప్రవేశపెట్టిన ఆటో మ్యూటేషన్ రిజిస్ట్రేషన్ కోసం పబ్లిక్ డేటాలో ఇంటి డోర్ నంబరు ఫీడ్ చేస్తే, అసెస్మెంట్ నంబరు కంప్యూటర్ డేటాలో కనిపించడం లేదన్నారు. అసెస్మెంట్ నంబరు ఫీడ్ చేస్తే, ఇంటి డోర్‌నంబరు కనిపించడం లేదన్నారు. దీంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ సీతాపతిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు గాదె రవికుమార్, నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటి కొండ ఎలియాజర్, ఒంగోలు అధ్యక్షుడు ఎం హరిబాబు, నెల్లూరు అధ్యక్షుడు జేవీబీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

- మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు
- బీట్ వ్యవస్థను పటిష్టం చేస్తాం
- ఎస్పీ అజిత బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా సోమవారం ఉదయం 9.50 గంటలకు పోలీసు కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ శాంతిభద్రతలు, నేరనియంత్రణ, నేర పరిశోధన, మహిళల సంరక్షణ, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై దృష్టి సారించి, కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. మారుతున్న సాంకేతికతను బట్టి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపడతామని, మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న నేరాల నియంత్రణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రౌడీ షీటర్లు, నేరచరిత గల వారిపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు. ఈగల్ బృందం సమన్వయంతో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. నేర నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింతగా పటిష్టం చేస్తామని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెంపొందించేలా సమర్థవంతంగా సేవలు అందచేస్తామని ఆమె తెలిపారు.

● దర్గామిట్ట స్టేషన్ తనిఖీ

బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ఎస్పీ అజిత నగరంలోని దర్గామిట్ట పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ మ్యాప్, చార్ట్, రిసెప్షన్ గది, స్టేషన్ పరిధిలోని నేర, శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. గత మూడేళ్ల కాలంలో క్రైం ఏవిధంగా ఉందో రికార్డులు పరిశీలించి, నేరాల నియంత్రణకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర డీఎస్పీ సింధుప్రియ, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా బుచ్చి

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీని గ్రేడ్- 2 మున్సిపాలిటీగా మార్చారు. ఈ మేరకు జీవో నంబరు 178ను విడుదల చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. గ్రేడ్-2 మున్సిపాలిటీగా మార్పు చెందడం వల్ల ప్రభుత్వం అధికంగా నిధులు మంజూరు చేయడంతోపాటు పట్టణంలో కూడా ఆదాయ వనరులు కూడా పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్‌శాఖామంత్రి పొంగూరు నారాయణకు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి కూడా వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో బుచ్చి గ్రేడ్-2 మున్సిపాలిటీ కావడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇక బుచ్చి పట్టణానికి మహర్దశ పట్టనున్నదని తెలిపారు.

ఎంపీడీవోలకు పోస్టింగులు

నెల్లూరు (జడ్పీ),సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదోన్నతి పొందిన పలువురికి ఎంపీడీవోలుగా పోస్టింగులు ఇస్తూ జడ్పీ సీఈవో మోహన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి, చిత్తూరు నెల్లూరు జిల్లాలకు చెందిన పలువురు డిప్యూటీ ఎంపీడీవోలు, ఏవోలకు ఇటీవల ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన వారికి ఆయన పోస్టింగులు ఖరారు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా చిట్టమూరు ఎంపీడీవోగా ఉమామహేశ్వరరావు, డక్కిలి ఎంపీడీవోగా సీహెచ్ రవీంద్రబాబు, వాకాడు ఎంపీడీవోగా ఎం. సాయిప్రసాద్, బాలాయపల్లి ఎంపీడీవోగా డీ. నారాయణ, ఓజిలి ఎంపీడీవోగా ఎం. నారాయణరెడ్డి, సూళ్ళూరుపేట ఎంపీడీవోగా టీ. సుకుమార్, దుత్తలూరు ఎంపీడీవోగా ఎల్. చెంచమ్మ, ఉదయగిరి ఎంపీడీవోగా బీ. శ్రీనివాసులు, నెల్లూరు రూరల్ ఎంపీడీవోగా ఎంవీ. రమణమ్మ, చేజర్ల ఎంపీడీవోగా ఆలీషాబాబు, సైదాపురం ఎంపీడీవోగా రామ్మోహన్‌రెడ్డి, కలువాయి ఎంపీడీవోగా ఎ. శైలజ, వరికుంటపాడు ఎంపీడీవోగా డీవీ.రమణారెడ్డికి పోస్టింగులు ఇచ్చారు. వీరంతా ఈ వారంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.



కావలి టౌన్ : విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు, కావలి, ముత్తుకూరులతోపాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు పెన్షన్ ట్రస్టుల్లో నిధులు జమచేసి, ట్రస్టులను బలోపేతం చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగుల పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తిగా వైద్య ఖర్చులు చెల్లించాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, క్షేత్రస్థాయిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, జేఎల్ఎం గ్రేడ్-2లను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు.

ఆ సీటు భలే హాటు..!

- చర్చనీయాంశంగా టీజీపీ ఎస్ఈ పోస్టు
- బలమున్నోళ్లకే కుర్చీ.. ఏడాదిలో నలుగురి మార్పు
- నెలాఖరుకు రిటైరవుతున్న ప్రస్తుత ఎస్ఈ
- తాజాగా ముగ్గురు యత్నాలు

నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మకరందం కోసం పూల చుట్టూ తేనెటీగలు తిరిగినట్లుగా ఇరిగేషన్ శాఖలోని ఇంజనీర్లు తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈ పోస్టు కోసం తిరుగుతున్నారు. ఏడాదిలో నలుగురు ఇంజనీర్లు ఈ పోస్టులో కూర్చోవడం గమనార్హం. ఒక అధికారి తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఆ సీటులో కూర్చున్న వెంటనే, మరో అధికారి వచ్చి దాన్ని కదిలిస్తారు. తాజాగా మరో ముగ్గురు అధికారులు ఈ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ వారి అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారు. అసలు ఎందుకు...? టీజీపీ ఎస్ఈ పోస్టుకు అంత డిమాండ్...? అన్నదే చర్చనీయాంశంగా మారింది.

● ఆ పోస్టుకు తీవ్రంగా యత్నాలు

టీజీపీ రెగ్యులర్ ఎస్ఈగా పనిచేస్తున్న హరినారాయణరెడ్డి గత ఎన్నికలకు ముందే రిటైర్డ్ అయ్యారు. ఆ స్థానంలో టీజీపీ వెంకటగిరి డివిజన్ ఈఈగా పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కొన్ని నెలలకే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నారు. ఆ స్థానంలో సోమశిల ప్రాజెక్టు ఈఈగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి ఇన్‌చార్జిగా వచ్చారు. మరికొన్ని నెలలకే ఈ స్థానంలో మళ్లీ రాధాకృష్ణమూర్తి ఇన్‌చార్జిగా వచ్చారు. ఇలా నాలుగైదు నెలలు గడిచాక ప్రభుత్వం ఇరిగేషన్ శాఖలో పదోన్నతులు కల్పించింది. ఈ క్రమంలో టీజీపీ రెగ్యులర్ ఎస్ఈగా రాధాకృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఆయన ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఇప్పుడు ఆ పోస్టు కోసం పలువురు అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజకీయ, ఆర్థిక బలమున్నోళ్లే ఇక్కడకు వస్తున్నారని టీజీపీ ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మరోసారి టీజీపీ ఎస్ఈ పోస్టు చర్చనీయాంశంగా మారింది. చాలామంది అధికారులకు ఈ ఎస్ఈ పోస్టుపై ఆసక్తి ఉన్నా, ప్రధానంగా ముగ్గురు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు ఆ శాఖలో చెప్పుకుంటున్నారు. ఎస్ఈ స్థాయి అధికారులు లేకపోవడంతో ఈఈ స్థాయి అధికారులు ఇన్‌చార్జి బాధ్యతల కోసం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో ఈఈగా ఉన్న సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ సర్కిల్‌లో డిప్యూటీ ఎస్ఈగా ఉన్న గిరి, ఒంగోలులో ఈఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనే అధికారులు టీజీపీ ఇన్‌చార్జి ఎస్ఈ పోస్టు కావాలని కోరుతున్నట్లు సమాచారం. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేల మద్దతును సంపాదించేందుకు ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరికి ఎవరికి ఇన్‌చార్జి బాధ్యతలు దక్కుతాయన్నది టీజీపీ వర్గాల్లో ఆసక్తిగా మారింది. కాగా ప్రస్తుతం టీజీపీ పరిధిలో ప్రధానంగా సోమశిల-కండలేరు వరద కాలువ విస్తరణ పనులు, సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 పనులు, ఆల్తూరుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్నాయి.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 550

సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

కావలి (టౌన్) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) బీజేపీ సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించాలని బీజేపీ నేతలు తీర్మానించారు. సోమవారం ఒకటవ పట్టణ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మందా కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ ఈనెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం నుంచి అక్టోబరు 2 మహాత్మా గాంధీ జయంతి వరకు నిర్వహించబోయే పార్టీ పక్షోత్సవాల ఏర్పాట్లపై చర్చిం చారు. సెప్టెంబరు 27న పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంత్యుత్సవాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, జీఎస్టీ సలహా మండలి సభ్యులు అమరా సుబ్బారావు, కుట్టుబోయిన బ్రహ్మానందం, కమల, సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభం

లింగసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలంలో మూడు వారాల క్రితం నిలిచిపోయిన ఆధార్ సేవలు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. నెల రోజుల క్రితం జిల్లా ఐటిడిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో కొద్ది రోజుల పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఈ కేంద్రానికి వచ్చి ఆధార్ సేవలు పొందారు. అయితే తర్వాత ఈ కేంద్రం ఆపరేటర్ ప్రమాదానికి గురవ్వడంతో కేంద్రం మూత పడింది. ఆధార్ సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో జిల్లా ఐటిడిఏ పీడీ స్పందించి కేంద్రం తిరిగి పనిచేసేలా ప్రశాంత్, దినేష్ అనే ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. ఆధార్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్, దినేష్‌లు మాట్లాడుతూ కార్యాలయం పని వేళల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు వచ్చి తమకు అవసరమైన ఆధార్ సేవలు పొందాలని వారు కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం గం 2-30 లకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగునని ఎంపీడీఓ నరేంద్రదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమావేశానికి మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమగ్ర సమాచారంతో తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ కోరారు.

స్వామిత్వ సర్వే త్వరగా పూర్తిచేయండి

లింగసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు సూచించారు. సోమవారం లింగసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటి స్థలాలను సర్వే చేసి, దానికి సంబంధించిన ధ్రువపత్రాలను ఇంటి యజమానులకు అందజేస్తారని చెప్పారు. దీంతో భవిష్యత్తులో ఇంటి పన్ను చెల్లించుటకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు ఉండవని చెప్పారు.

రేపు, ఎల్లుండి మండల స్థాయి క్రీడాపోటీలు

కందుకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల బుధ, గురువారాల్లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె. సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగ, చెస్, బ్యాడ్మింటన్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. 17న అథ్లెటిక్స్, 18న క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని జడ్పీ హైస్కూల్స్, కెజీబీవీ, మోడల్ స్కూల్‌లతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు మండల ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్‌ను ఫోన్ నెం. 9848061214లో సంప్రదించాలని కోరారు.

పశువులకు 'గాలికుంటు' టీకాలు వేయించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయించి పశుసంపదను కాపాడుకోవాలని వెటర్నరీ ఏడి డాక్టర్ ఎం తోటి చెన్నకేశవులు తెలిపారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో సోమవారం గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాను స్థానిక సర్పంచ్ సాధు శ్రీలత వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడి చెన్నకేశవులు మాట్లాడుతూ 4 నెలలు దాటిన దూడల నుండి అన్ని పశువులకు డాక్టర్ల సలహాల మేరకు టీకాలు వేయించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల్లో 75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సబ్సిడీ పశుగ్రాసం విత్తనాలు కావల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్స్‌తో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాధికారి సుదర్శన్ సుధాకర్, డీలర్ కాకుమాను ఆంజనేయులు, సిబ్బంది ఉప్పుటూరి కిరణ్, శ్రీలత, శరత్, వినోద్ పాల్గొన్నారు.

బ్రాహ్మణక్రాక మోడల్ ప్రాథమిక పాఠశాల పరిశీలన

జలదంకి, సెప్టెంబర్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాక ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను డైట్ అధ్యాపకురాలు ఎం పద్మజ సోమవారం పరిశీలించారు. బోధన, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలు తీరును ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డ్రాపవుట్స్ తగ్గించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు టీ. శ్రీరాం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని..

● ఉపాధ్యాయులు నిరసన

కావలి (టౌన్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు స్థానిక పాత తాలూకా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ నేతలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటను విడుదల చేయాలని, పీఆర్సీ, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బిళ్ళ కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె రఘునాథరావు, ప్రధాన కార్యదర్శి బూచి మధుసూదన్‌రావు, నాయకులు సంజీవ్, వైవీ నాగేశ్వరరావు, రామారావు, కట్ట శీనయ్య, కృష్ణప్రసాద్, రాజేష్, సుబ్రమణ్యం, మహేష్ పాల్గొన్నారు.



విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి

కావలి (టౌన్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముసునూరు వినాయకనగర్ కాలనీకి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు, సీపీఎం నేతలు విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీకి వినతి పత్రం అందించారు. వినాయకనగర్ కాలనీకి 15 సంవత్సరాలుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయలేదన్నారు. అర కిలోమీటర్ పైనుంచి కర్రలు నాటుకుని కొంతమంది విద్యుత్ వైర్లు లాక్కున్నామని, మిగిలిన వారు చీకట్లోనే ఉంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పి పెంచలయ్య, నాయకులు జీ మధుసూదన్‌రావు, పీ తిరుపాలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్ల పెన్‌డౌన్

కావలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ విధానంలో ఉన్న ఇబ్బందులు తొలగించి, సులభతరం చేయాలని కోరుతూ కావలిలో సోమవారం డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు. డాక్యుమెంట్లు రాయకుండా, స్టాంపులు ఇవ్వకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్న లోపాలను సరిచేయాలని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, స్టాంపులు విక్రయించే సమయంలో ఓటీపీ విధానం వల్ల రిజిస్ట్రేషన్‌లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విధానం వల్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, ఆర్థిక భారం కూడా పెరుగుతోందన్నారు. ఓటీపీ విధానాన్ని, పబ్లిక్‌డేటా విధానాన్ని రద్దు చేయాలన్నారు. అలాగే 2.0 కార్డు విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. చలానాలో వస్తున్న తప్పులను కూడా సరిచేయాలన్నారు. భవనాల రిజిస్ట్రేషన్ అనంతరం ఆటో మ్యుటేషన్ వల్ల కొన్ని లోపాలు దొర్లుతున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చలంచర్ల నాగరాజు, పీడీఎం ప్రసాద్, స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శేషయ్య, టీసీ మాల్యాద్రి నాయుడు, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు

మా వార్డులో మద్యం దుకాణాలు వద్దు

● ఆర్డీవోకు 13వ వార్డు ప్రజల వినతి

కావలి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) స్థానిక 13వ వార్డులోని రామ్మూర్తిపేట, పుల్లారెడ్డినగర్, బొద్దుకూరువారి వీధి ప్రారంభంలో ట్రంకు రోడ్డు వద్ద బార్ అండ్‌రెస్టారెంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని, మా ప్రాంతంలో మద్యం దుకాణం వద్దని స్థానికులు కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. సత్యనారాయణ స్వామి ఆలయం ప్రాంతంలో అనేక విద్యాసంస్థలు ఉన్నందున మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ప్రశాంతతకు భంగం కలుగుతుందన్నారు. మున్సిపల్ పార్కుకూడా ఉన్నందున సాయంత్రం పెద్దలు, పిల్లలు ఆహ్లాదం కోసం అక్కడకు వెళుతుంటారని, మద్యం దుకాణం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే తాము అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మద్యం దుకాణం వద్దంటూ ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

మద్యం బెల్టు దుకాణాలు తొలగించాలి

● అన్నవరం, చినక్రాక యువకుల డిమాండ్

జలదంకి, సెప్టెంబర్15(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్టుదుకాణాలను తొలగించాలని అన్నవరం, చినక్రాక గ్రామాలకు చెందిన దళిత యువకులు డిమాండ్ చేశారు. జలదంకిలో సోమవారం వట్టికాల గిరిబాబు, చంద్రయ్య, ఏడుకొండలు, శ్రీనివాసులు, జ్యోతి వెంకట్రావు, నేలపాటి మల్లేశ్వరరావు, గంధం ప్రమోద్‌కుమార్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్వార్టర్ మద్యం బాటిల్ ధర రూ.99కు అమ్మాల్సి ఉండగా రూ.200కు విక్రయిస్తున్నారన్నారు. బెల్టు దుకాణాలు తొలగించాలని చెబితే.. అడగడానికి మీరెవరు? అంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. మండలంలో రూ.50 లక్షలు అడ్వాన్సు దండుకుని పేదల ఇళ్ళకు మద్యం సరఫరా చేస్తూ జీవితాలతో ఆడుకుంటున్నారని వాపోయారు. ముఖ్యంగా అన్నవరం, చినక్రాక గ్రామాలలో ఈ బెల్టు దుకాణాల వల్ల తాగుబోతులు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కావలి ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి బెల్టు దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

అల్లూరులో ఆగిన రిజిస్ట్రేషన్లు

అల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అల్లూరులో దస్తావేజు లేఖరులు సోమవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని పాటించారు. ఓటీపీ, ఆధార్ కార్డులు తదితర సమస్యలతో తమతోపాటు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఒక్క దస్తావేజును కూడా లేఖరులు దాఖలు చేయకపోవడంతో స్థానిక సబ్ రిజిస్ట్రారు కార్యాలయం రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్తంభించింది. వెనుతిరిగి వెళ్లిపోయారు.

'ఉపాధి'ని పటిష్టంగా అమలు చేయాలి

కావలి,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. జలదంకి మండ లం తిమ్మసముద్రం, కేశవరం, కావలి రూరల్ మండలం అన్నగారిపాలెం, సింగిరిగిరివారిపాలెం, గౌరవరం గ్రామాలలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాధాక్రిష్ణ య్య, నారాయణమ్మ, తిరుపతమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

16వ వార్డులో దివ్యాంగులకు కేటాయించిన నివేశన స్థలాలు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దివ్యాంగుల కాలనీ ప్రెసిడెంట్ మండవ వెంకట్రావు కోరారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. కొందరు వీఆర్ఏల కుటుంబ సభ్యులు దివ్యాంగుల కాలనీలో ప్లాట్లు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు తెలిపినా స్పందించడం లేదన్నారు. దివ్యాంగుల స్థలాలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు

బిట్రగుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దారు సానా శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముంగమూరుకు చెందిన పట్టాదారు భూమి ప్రభుత్వ భూమిగా వస్తోందని రైతు వెంకటేశ్వర్లు వినతి పత్రం అందచేశారన్నారు. అల్లిమడుగు పంచాయతీలో భూసర్వే చేయాలని అర్జీ ఇచ్చారని తెలిపారు. ముంగమూరులో కొంత మంది వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ డీలర్లు సరుకులు ఇళ్ల వద్దకు చేర్చడం లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు యన్నాబత్తిన వెంక టేశ్వర్లు, శ్రీనివాసులు రెడ్డి తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లారు. డీలర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని ఆనెమడుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ వెంకటరత్నం పేర్కొన్నారు. కావలికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్లు పొన్నగంటి రాజేష్‌రామ్, ముని కావ్య దంపతులు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. దాతలకు ఉపాధ్యాయురాలు లావణ్య కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

ఉలవపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బద్దిపూడి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 37 కుటుంబాలు ఆపార్టీని వీడి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత గ్రామంలో ఉపాధి నిధులు రూ.16 లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ గ్రామాలకు మహర్దశ పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, కూనం రాఘవరెడ్డి, కూనం బ్రహ్మానందరెడ్డి, తాతిరెడ్డి ఆదినారాయణ, శ్రీనివాసులు, వేణుగోపాల్, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఇంటూరి

జనసేన కార్యకర్త శ్రీవర్ధన్ మృతికి నివాళి

● అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం



శ్రీవర్ధన్ తల్లిని ఓదారుస్తున్న జనసేన నేత వెంకటేశ్వర్లు

జలదంకి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్త శ్రీవర్ధన్ ఆదివారం ఎన్‌హెచ్ 167 బీజీ రహదారిపై రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో ఉదయగిరి నియోజకవర్గ జనసేన పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు సోమవారం జలదంకిలో శ్రీవర్ధన్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి తల్లిని ఓదార్చి అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా కొట్టే వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ జనసేనలో చురుకైన కార్యకర్త శ్రీవర్ధన్ అని, ఆదివారం కావలి వైపు నుండి ట్రాక్టర్ నడుపుతూ జలదంకి వస్తూ రోడ్డుప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ తరపున మృతుడి కుటుంబాన్ని ఆదుకునేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తోట మురళి, జలదంకి పీఏసీఎస్ డైరెక్టర్ జానీ, నియోజకవర్గ నేత నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల దూరం

ఉలవపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కరేడు పరిధి గ్రామాలైన మన్నేటికోట, ఉలవపాడు, కరేడు గ్రామాల్లో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించినట్లు వైద్యధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఇంటి ఆవరణలో పనికిరాని వస్తువులు, వాడని వస్తువులలో నీటి నిల్వలు ఉన్నందున డెంగ్యూ దోమలు గుడ్లుపెట్టి అభివృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. ఇంటింటి సందర్శనలో ప్రజలకు అవగాహన కల్పిస్తు వాడకంలోలేని వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని వైద్యఆరోగ్య సిబ్బంది దగ్గరుండి తొలగించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉలవపాడు పంచాయతీ, వైద్యఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా గ్రామంలో ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నాగలక్ష్మీ, కార్యదర్శి వీరయ్య, కందుకూరు సబ్‌యూనిట్ అధికారి రామారావు, సూపర్‌వైజర్లు, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని డ్రైవర్ మృతి

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం ముసునూరు జాతీయ రహదారిపై లారీ టైరు మారుస్తుండగా వెనుక నుండి మరో లారీ ఢీకొనడంతో టైరు మారుస్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ హజగర్‌ఖాన్(39) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. కలకత్తా నుండి కోయంబత్తూరుకు వెళుతున్న రెండు లారీలు సోమవారం మధ్యాహ్నం ముసునూరు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి పైకి చేరుకున్నాయి. ముందు వెళ్తున్న లారీ టైరు పగిలిపోవడంతో ఆ లారీని రోడ్డు మార్జిన్ లో ఆపి, డ్రైవర్ టైరు విప్పుతుండగా వెనుకనుండి మరో లారీ వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ హజగర్‌ఖాన్‌ను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సకాలంలో సమాచారం అందలేదని తెలిసింది.

పెట్రేగిపోతున్న పెట్రోల్ దొంగలు

● మోటారు బైకుల వైర్లు కత్తిరించి పెట్రోల్ చోరీ

● ముసునూరు ఇందిరమ్మ కాలనీలో వరుస దొంగతనాలు

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు ఇందిరమ్మ కాలనీలో పెట్రోల్ దొంగలు పెట్రేగిపోతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అట్టల ఫ్యాక్టరీ కాలనీ సమీపంలో నివశించే కాళిదాసు ఆనంద్ ఇంటి ముందు మోటారు బైక్ పార్కు చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి పైపులు కత్తిరించి పెట్రోల్ చోరీ చేశారు. వారం రోజుల క్రితం అదే వీధిలో పెయింటర్ పెద్దిపోగు కిషోర్ మోటారు బైకు నుంచి పైపులు కత్తిరించి పెట్రోల్ దొంగిలించారు. ఆ ప్రాంతంలో అందరూ దినసరి కూలీలు కావడంతో వరుస పెట్రోల్ దొంగతనాలతో లబోదిబోమంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత 10 రోజులుగా వరుసగా పెట్రోల్ దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల సంచారం ఎక్కువగా జరుగుతుందని, అర్ధరాత్రిళ్ల వరకు రోడ్ల వెంట తిష్టవేసి ఉంటుండటంతో అనేక అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు. మత్తుపదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. గుర్తు తెలియని వ్యక్తుల సంచారంపై పోలీసులు దృష్టిసారించాలని, రాత్రివేళల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యుత్ లోఓల్టేజ్ సమస్య పరిష్కరిస్తాం

బిట్రగుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ మసీదువీధిలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరిస్తామని ఏఈ జడరాయ తెలిపారు. కొన్నేళ్ళ క్రితం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంబాలను మార్చాలని టీడీపీ నేతలు సీహెచ్. వెంకటేశ్వర్లు, సుభాని కోరడంతో సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ద్వారా విద్యుత్ సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే ఎస్టిమేషన్లు పంపించడమే కాకుండా విద్యుత్ ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

కావలి (టౌన్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం వెంగళరావునగర్‌లోని విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు ఎస్‌కె సందాని మాట్లాడుతూ పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జేఎల్ఎం గ్రేడ్ 2లను, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈఈ బెనర్జీ, ఏఈ వసంతరావు, కార్యాలయ అధికారులు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన చిలకపాటి

కందుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమితులైన చిలకపాటి మధుబాబు సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అవకాశం కల్పించేందుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు మద్దతుగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆయన ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లా డుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందనేందుకు చిలకపాటికి దక్కిన పదవే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధిర మధు, మహర్షి శ్రీను, బెజవాడ ప్రసాదు, చుండూరి శ్రీను, పతకమూరి వరప్రసాద్, రావూరి రామకోటయ్య, పూజల వెంకటరావు, పోలుగంగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న మధుబాబు

'గాలికుంటు' టీకాలు వేయించండి

కందుకూరు నియోజకవర్గంలో ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తక్షణమే వేయించాలని ఎమ్మెల్యే ఇంటూరి కోరారు. పశుపోషకులంతా గాలికుంటువ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంపై పశుసంవర్థకశాఖ రూపొందించిన ప్రచార పోస్టర్‌లను సోమవారం అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ డీడీ డాక్టరు శ్రీధర్, అసిస్టెంటు డైరక్టర్లు జీవీ చంద్రమోహన్, వి. చెన్నకేశవులు, పశువైద్యాధికారులు వై. శ్రీకాంత్, ఎస్. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలి

లింగసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండరాయునిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ముక్తేశ్వరం ఎస్సీ కాలనీకి చెందిన శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమణ నుండి విడిపించాలని నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, ఆ కాలనీవాసులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో వారు తహసీల్దార్ ఎం కోటేశ్వరరావుకు ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించి చదును చేసి తమ పొలంలో కలుపుకున్నారని తహసీల్దార్ కోటేశ్వరరావుకు వివరించారు. ఆక్రమణదారుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎస్సీలకు న్యాయం చేయాలన్నారు. దీంతో ఆయన స్పందించి మంగళవారం శ్మశానవాటిక స్థలాన్ని ఆర్ఐ, వీఆర్ఓ, సర్వేయరు ద్వారా కొలిపించి, హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో గౌడపేరు రత్నం, యేసేబు, ఆనంద్, బాలయ్య, సురేష్, రమేష్, మల్లిఖార్జున, దావీదు, ప్రసాదు, రాజేష్, కొండయ్య, మోజేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న మోషే, కాలనీవాసులు

పంట పొలం కాదు ... కోవూరు చెరువు!

ఇది పంటపొలం కాదు. వేలాది ఎకరాలకు సాగునీరందించే కోవూరు చెరువు. గత కొద్దికాలంగా చెరువులో పెరిగిన గుర్రపుడెక్కను తొలగించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. స్వచ్ఛమైన సాగునీరు కన్పించాల్సినచోట.. గుర్రపు డెక్క చెరువును దట్టంగా ఆక్రమించేసింది. గుర్రపు డెక్కను తొలగించాలని చాలాసార్లు రైతులు ఇరిగేషన్ శాఖాధికారులకు విన్నవించుకున్నారు. అయినా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కోవూరు చెరువు మొత్తం పచ్చని పంట పొలాన్ని తలపిస్తోంది.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం రేపటి నుంచి వైద్య శిబిరాలు : డీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశాఖతోపాటు స్త్రీశిశుసంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా నిర్వహించే ఈ శిబిరాల్లో మహిళలకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. జీజీహెచ్, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీ. పీహెచ్‌సీ, యూహెచ్‌సీలు, 497 ఆరోగ్య ఉపకేంద్రాల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అలుగు వాగు ఆక్రమణతో పొలాలపైకి నీరు

పట్టణంలోని ఉప్పుచెరువుకు సంబంధించిన అలుగు వాగు ఆక్రమణలకు గురవడంతో అలుగునీరు పొలాలపై పడుతోంది. ఉప్పుచెరువు ఆయకట్టు భూమిలో అధికభాగం రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోవటంతో పారుదల తగ్గిపోయింది. దీంతో చెరువులోని నీటిని బయటకు పంపించేందుకు చేపల పెంపకందారులు అలుగును పగులగొట్టారు. అయితే వాగు ఆక్రమణలకు గురికావటంతో నీరు పొలాల్లోకి ప్రవహించి భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోతున్నాయని మహదేవపురం గ్రామ రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని, అలుగుకు మరమ్మతులు చేయించి తమ భూములను కాపాడాలని కోరుతున్నారు.

- కందుకూరు(ఆంధ్రజ్యోతి)



పగులగొట్టిన ఉప్పుచెరువు అలుగు



ఆక్రమణలకు గురై కుచించుకు పోయిన అలుగు వాగు

పరిశ్రమల కోసం భూబ్యాంకు!

- జిల్లాకు తరలివస్తున్న భారీ పరిశ్రమలు
- ఇందుకోసం 5 వేల ఎకరాల సేకరణకు సన్నద్ధం
- 'ఆంధ్రజ్యోతి'తో ఏపీఐఐసీ జెడ్‌ఎం శివకుమార్

'ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు అందజేస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.' అని ఏపీఐఐసీ జెడ్‌ఎం ఎల్.శివకుమార్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ 'జిల్లాకు బీపీసీఎల్ వంటి భారీ పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు కానున్నాయి. ఇటువంటి పరిశ్రమల ఏర్పాటుకు భూ బ్యాంకు తప్పనిసరిగా ఉండాలి. అందుకనుగుణంగానే జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భూసేకరణ చేపడుతున్నాము. ప్రస్తుతానికి 5 వేల ఎకరాలు సేకరించేందుకు భూములను పరిశీలిస్తున్నాము. ప్రధానంగా నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాము. ఇప్పటికే పలు నియోజక వర్గాల్లో భూసేకరణ పూర్తి చేసి పార్కులను ప్రారంభించాము. నారంపేట ఫేజ్ 1, 2 కలిపి 333 ప్లాట్‌లను సిద్ధం చేశాము. వీటిలో 15 ప్లాట్లను ఇప్పటికే విక్రయించాము. త్వరలో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. అదేవిధంగా నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ప్రాంతంలో 29.65 ఎకరాల్లో దాదాపు 147 ప్లాట్‌లను సిద్ధం చేశాము. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నాము. అదే విధంగా ఉలవపాళ్ల వద్ద 25 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుకు భూసేకరణ చేపడుతున్నాము. నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో నగరంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం పీఎఫ్‌సీ (ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్)ను నిర్మిస్తున్నాము.



ఇంటర్వ్యూ...

● రెండేళ్లలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ నుంచి భూములు కొనుగోలు చేసిన తరువాత ఏళ్ల తరబడి పరిశ్రమలు స్థాపించని వాటిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ఇప్పటికే బొడ్డువారిపాళెం పార్క్‌లో దాదాపు 15 మంది కేటాయింపులను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చాము. భూమి కొనుగోలు చేసిన రెండేళ్ల లోపల పరిశ్రమ నిర్మాణ పనులు ప్రారంభించాలి. ఈ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు అందజేస్తోంది. వీటిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

డేంజర్‌లో ఓజోన్


- ప్రశ్నార్థకరంగా జీవకోటి మనుగడ
- క్యాన్సర్, చర్మవ్యాధుల బారిన మానవాళి
- 'ఓజోన్'దెబ్బతినడమే భూతాపానికి కారణం
- మేలుకోకుంటే పరిస్థితి ఆందోళనకరం

● నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూమిపై ప్రతీ జీవరాశికి రక్షణ కవచంలా ఉన్న ఓజోన్ పొర పెనుప్రమాదంలో పడింది. దీంతో మానవాళితోపాటు సర్వ జీవరాశుల మనుగడే ముప్పు వాటిల్లుతున్నది. భూమిపై 15 నుంచి 25 కిలోమీటర్ల వరకు ఉండే ఓజోన్‌పొర సూర్యుడి నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపైకి చేరకుండా, అందులో ఉండే అతినీలలోహిత కిరణాలను సంగ్రహిస్తుంది. తద్వారా ప్రాణికోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుంది. ఈ క్రమంలో గత 30 ఏళ్ల నుంచి ఓజోన్ పొర క్షీణిస్తున్నదని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో జీవకోటికి తలెత్తే ముప్పును గమనించిన ఐక్యరాజ్యసమితి ఓజోన్ పరిరక్షణ కోసం సెప్టెంబరు 16న (నేడు) అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించింది. ప్రజల్లో దీనిపై అవగాహన పెంచేలా కార్యక్రమాలను రూపొందించింది. జిల్లాలో ప్రస్తుత పరిస్థితుల్లో ఓజోన్ సంరక్షణకు మేధావులు మేలుకోవాలని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● జిల్లాలో పరిశీలిస్తే ..

జిల్లాలో ఓజోన్ పరిస్థితిని పరిశీలిస్తే ప్రమాదకరంగా మారుతోంది. ప్రకృతిపరంగా కాలుష్యం పెరుగుతుంది. జిల్లాలోని గ్రామాల నుంచి అనేక మంది పట్టణాలకు వలసలబాట పట్టడంతో కాలుష్యం పెరిగిపోతూ ఉంది. ఇబ్బడి ముబ్బడిగా మోటారు



వాహనాలు పెరగటం, పరిశ్రమల కాలుష్యం, అధికశాతం మంది ఏసీల వినియోగం ఓజోన్ పొరకు చేటు తెస్తున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హేలోన్స్, మిథైల్ క్లోరోఫాం, మిథైల్ బ్రోమైడ్, హైడ్రోకార్బన్‌లు, సీఎఫ్‌సీ వంటి రసాయనిక వాయువులు ఓజోన్ పొరకు ప్రమాదాన్ని తీసుకువస్తున్నాయి. ఏరోసోల్ ఉత్పత్తులు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఫోం బ్లోయింగ్ ఉత్పత్తులు, అధికంగా స్ప్రేల వినియోగం వల్ల ఓజోన్ ముప్పు వాటిల్లుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఋతువులు గతి తప్పటం, వేసవి తీవ్రత వంటి సమస్యలకు మానవాళి తప్పిదమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వీటి వాడకం తగ్గించి, ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా తగ్గించ కలిగితే ఓజోన్‌ను రక్షించుకోవచ్చని మేధావులు చెబుతున్నారు. టైర్లు, రబ్బర్లు, ఇతర ఆధునిక ప్లాస్టిక్‌లను కాల్చటం వల్ల క్లోరిన్ సంబంధిత సేంద్రీయ పదార్థాలు వాతావరణం లో పెరుగుతాయి. ఇలా నత్రజని, సల్ఫర్ ఆక్సైడ్ లు, క్లోరోఫ్లోరో కార్బన్‌లు రసాయనిక చర్యవల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఓజో న్ ప్రమాదకర స్థాయికి చేరితే మానవాళికి ప్రా ణాధారమైన ఆక్సిజన్ అందే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితిలో శాస్త్రవేత్తల సూచనలను పాటించకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా ఉంటుంది.

● ప్రమాదకర వ్యాధులకు అవకాశం

ఓజోన్ పొర దెబ్బతినటం వల్ల నేరుగా అతినీలలోహిత కిరణాలు భూమిని తాకటంతో క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వెలుగుచూస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 13వేల మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారు. ఏటా ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. ఓజోన్‌పొరకు చిల్లులు పడి అతినీల లోహిత కిరణాల కారణంగా చర్మ క్యాన్సర్‌కు గురవుతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ తెలియచేస్తున్నది. వీటితోపాటు నేత్ర, జన్యుపరమైన వ్యాధులు సంక్రమిస్తున్నాయి. సముద్ర జీవరాశి కూడా నశించిపోయే పరిస్థితి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో మానవాళి మేల్కోకుంటే ముప్పు తప్పదు.

ఓజోన్ దెబ్బతినటంతో తీవ్ర అనారోగ్యం

ఓజోన్‌పొర దెబ్బతినడం మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంపై బొబ్బలు రేగి అవి క్యాన్సర్ గడ్డలుగా రూపాంతరం చెందే పరిస్థితులు ఏర్పడుతున్నా యి. ఓజోన్ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలి. విరివిగా చెట్లు నాటాలి.



- డాక్టర్ కాలేషాబాషా, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్, జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు

పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

క్యాన్సర్ వ్యాధి జిల్లావాసులను కలవరపెడుతుంది. ఇందుకు ఓజోన్ పొర దెబ్బతినడం కూడా ఓ కారణం. ఎంతో మంది స్వామస్ సెల్ క్యాన్సర్, బేసాల్ సెల్ క్యాన్సర్, మాలిజెంట్ మెలినోమా వంటి క్యాన్సర్‌లకు గురవుతున్నారు. ఇందులో మాలిజెంట్ మెలినోమా అత్యంత ప్రమాదకరమైనది. అందరూ అప్రమత్తంగా ఉండాలి.



- డాక్టర్ గీతా ఉషశ్రీ, క్యాన్సర్ వైద్య నిపుణులు, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి

ఫిర్యాదులపై అలసత్వం తగదు

● ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం తగదని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహ రించి పిటీషన్లను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల అధికారులను ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అజిత వేజెండ్ల

గంగమ్మకు హారతి

● సంగం బ్యారేజ్ గేట్లు ఎత్తి నీటి విడుదల

పెన్నానది సంగం బ్యారేజ్ వద్ద నాయకులు, అధికారులు సోమవారం గంగమ్మకు హారతులిచ్చి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సోమశిలలో విడుదల చేసిన నీటి ప్రవాహం సోమవారం సంగం బ్యారేజ్‌కి చేరాయి. దీంతో సంగం బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.5 అడుగుల నుంచి క్రమేణ పెరుగుతూ సాయంత్రానికి 11 అడుగులకు చేరింది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం పెరగకుండా వచ్చే నీటిని యథా విధిగా దిగువకు విడుదల చేసే ఏర్పాటు చేశారు. బ్యారేజ్ డీఈ విజయరామి రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, అన్నారెడ్డి పాళెం నీటిసంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి గంగమ్మకు హారతు లిచ్చి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఈలు వినయ్ కుమార్, ప్రసాద్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



బటన్ నొక్కి బ్యారేజ్ గేట్లు ఎత్తుతున్న నాయకులు, అధికారులు

- సంగం(ఆంధ్రజ్యోతి)

మెట్టలో మాణిక్యం

● ఆత్మకూరుకు చెందిన డాక్టర్ విరాజితకు బంగారు పతకం

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీలోని వెంకట్రావుపల్లికి చెందిన వైద్య విద్యార్థిని డాక్టర్ పందల విరాజిత ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నేపథ్యంలో కడపలోని రిమ్స్ వైద్యశాలలో ఈ నెల 13, 14వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జనరల్ మెడిసిన్ వైద్యుల 53వ సదస్సులో ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆమె బంగారు పతకం అందుకున్నారు. డాక్టర్ విరాజిత కడపలోని రిమ్స్‌లో జనరల్ మెడిసిన్ చదువుతూ ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం 2024లో నిర్వహించిన ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో 76.8 శాతం మార్కుల తో ప్రథమ స్థానాన్ని సాధించి గోల్డ్ మెడల్ సాధించింది. డాక్టర్ విరాజితను ఆంధ్రప్రదేశ్ జనరల్ ఫిజిషియన్ వైద్యుల రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ అల్లాడి మోహన్, రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మునీశ్వర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ యాదవేంద్రరెడ్డి, ఇతర బంధుమిత్రులు అభినందించారు.



నేటి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీలకు శిక్షణ

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడు రోజులపాటు జడ్పీటీసీ, ఎంపీ టీసీ, సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో జే.మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ప్రజాప్రతి నిధులకు జిల్లా స్థాయిలో స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత - గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అనే అంశంపై శిక్షణ కార్యక్రమం జరుగు తుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి ఖచ్చితంగా మహిళ సభ్యులు హాజరు కావాలన్నారు.

పట్టుబడ్డ దొంగలు 11 బైకుల స్వాధీనం

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధి లో ద్విచక్ర వాహనాలను అపహరించుకు వెళ్తున్న దొంగలను నెల్లూరురూరల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి నుంచి 11 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సం బంధించిన వివరాలను రూరల్ సీఐ గుంజి వేణు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని కోటమిట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ సిద్దిక్, వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన పఠాన్ రోషన్‌లు ధనలక్ష్మీపురం కూడలిలో అ నుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నెల్లూరురూరల్‌తో పాటు కావలి 1, 2వ టౌన్, రూరల్, గూడూరు 1, 2వ టౌన్ పరిధిలో 10 మోటారు సైకిళ్లను అపహరించుకెళ్లినట్లు అంగీకరించారు. మరో బైకును స్వాధీనం చేసుకోగా దానిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. వీటి విలువ రూ. 10.4 లక్షలు ఉంటుంది. దీంతో వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడంలో ఎస్ఐ లక్ష్మణరావు, ఏఎస్ఐ రఫీ, మోహన్ బాబులు క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

● పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ పాల్గొని అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిచి వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈఓ మోహన్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు ఉమాంగ్ యాప్‌పై అవగాహన కల్పించాలని కోరుతూ బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకా ప్రవీణ్ వినతిపత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సేవలు, పథకాలు ఉమాంగ్ యాప్‌లో ఉన్నాయన్నారు. ఈ యాప్‌పై జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించి, వారు వినియోగించుకొనేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్, బెల్లంకొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు చిన్న పెంచలయ్య వినతిపత్రం అందచేశారు. పలుకాలనీల్లో యానాదులకు కనీస సౌకర్యాలు లేవని, వాటిని కల్పించాలని కోరారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు వినతిపత్రం అందచేశారు. జిల్లాలో ఎడగారు వరి కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

పడితే ప్రాణాలు దక్కవు

● సోమశిల ప్రాజెక్టు వద్ద పొంచి ఉన్న ముప్పు

సోమశిల జలాశయం ప్రముఖ పర్యాటక ప్రాంతం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి ప్రతిరోజు పర్యాటకులు వస్తుంటారు. అయితే ప్రాజెక్టు వద్ద ప్రమాదం పొంచి ఉన్న విషయం వారికి తెలియదు... ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్న శ్రద్ధ అధికారులకు లేదు. జలాశయం ప్రధాన నిర్మాణంపై రెండు వైపులా దిమ్మెల తో రక్షణ ఏర్పాట్లు చేసిన పరిస్థితి ఉండగా వాటి అంచున నిలబడి ప్రాజెక్టు అందాలు వీక్షిస్తారు. అయితే కొన్ని చోట్ల దిమ్మెలు పగుళ్ల ఏర్పాడి వుండగా మరికొన్ని చోట్ల దిమ్మెలు పడిపోయి ఊచలు కనిపిస్తున్నాయి. సుమారు వందకు పైగా దిమ్మెలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ప్రమాదాలు జరుగకముందే పనులు చేయించాలని పలువురు కోరుతున్నారు.



దిమ్మెలు పడిపోయి కనిపిస్తున్న ఊచలు

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

వైద్యులు ఒకరు.. రోగులు 275 మంది !

● సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత

ఉదయగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత రోగులను వేధిస్తోంది. వైద్యశాలలో 12 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు సదరం పరీక్షలు నిర్వహించేందుకు వెళ్లగా, మరొకరికి ఆఫ్ కావడంతో ఊరెళ్లారు. ఇక దంత వైద్యుడు వైద్యశాలలోనే రోగులకు సేవలందిస్తున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో వైద్యశాలకు రోగుల తాకిడి అధికంగా ఉంది. సోమవారం వివిధ రుగ్మతలతో బాధపడుతూ వైద్యశాలకు రోగులు బారులుతీరారు. 245 మంది ఔట్, 30 మంది ఇన్‌పేషెంట్లను కలిపి మొత్తం 275 మందికి కంటి వైద్యనిపుణుడు ఒక్కరే సేవలందించాల్సి వచ్చింది. వైద్యశాలలో ఒక్క వైద్యుడు అందుబాటులో ఉండడంతో రోగులు గంటల తరబడి క్యూలో ఉండాల్సిన దుస్థి తి నెలకొంది. ఆ వైద్యశాలకు వెళితే ఉన్న రోగం నయం కావడం అటుంచితే.. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండడంతో నీరసించి కొత్తరో గం తెచ్చుకోవాల్సిన వస్తుందని పలువురు రోగులు వాపోతున్నా రు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందిం చి వైద్యశాలలో వైద్యు ల కొరత తీర్చాలని పలువురు కోరుతున్నారు.



ఓపీ కోసం బారులు తీరిన రోగులు

సమస్యల పరిష్కారానికి 22 వరకు నిరసనలు

● విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22వ తేదీ వరకు ప్రతి రోజూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జేఏసీ జిల్లా ఛైర్మన్ కొండపల్లి శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై సోమవారం నెల్లూరులోని విద్యుత్ భవన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పలుమా ర్లు విద్యుత్ యాజమాన్యానికి, ప్రభుత్వానికి తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేసినా తమ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యుత్ జేఏ సీ తలపెట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 22వ తేదీ లోగా తమ సమస్యలు పరిష్కారం కానీ ఎడల ఆందోళన మ రింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకు లు షేక్ అల్తాఫ్, టీ శ్రీనివాసులు, డీ దామోదర్, వీ వెంకటేశ్వర్లు, సయ్యద్ రఫీ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పీ.కృష్ణ, షేక్ హజరత్‌వలి, నాంచార య్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు